

ఐదుగురు నర్సింగ్ విద్యార్థినులకు అస్వస్థత

- పెందుర్తి సీహెచ్‌సీలో చికిత్స
- కారణాలపై ఆరా తీస్తున్న అధికారులు
- ఫుడ్ పాయిజన్ కారణమని అనుమానం

..మెయిన్‌లో



హత్యచేసి కాల్చేశారు!

కాపులుప్పాడ ప్రాంతంలో గల ఓ లేఅవుట్‌లో గుర్తు తెలియని వ్యక్తి దహనం

హతుడు పెందుర్తి జ్యోతిష్కుడు మోతి అప్పన్న అయి ఉండవచ్చునని అనుమానం





శవాన్ని దహనం చేసిన ప్రదేశంలో పూసల దండలు (ఇన్‌సెట్‌లో) అదృశ్యమైన జ్యోతిష్కుడు మోతి అప్పన్న (ఫైల్ ఫొటో)

- ఆనందపురం వెళ్లేందుకని చెప్పి పది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు...
- తిరిగి రాకపోవడంతో మరుసటిరోజు పోలీసులకు కుమారుడి ఫిర్యాదు

భీమునిపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

నగర పరిధిలోని కాపులుప్పాడ వద్ద గల ఒక ప్రైవేటు లేఅవుట్‌లో వ్యక్తి శరీర భాగాలు కాలిపోయి చెల్లా చెదురుగా పడివుండడం కలకలం రేపింది. అవి పది రోజుల క్రితం అదృశ్యమైన పెందుర్తి బీసీ కాలనీ నివాసి, జ్యోతిష్కుడు మోతి అప్పన్న (50)వి అయి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. హత్య చేసి గుర్తు పట్టకుండా ఉండేందుకు దహనం చేసి ఉంటారని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

పెందుర్తికి చెందిన అప్పన్న జ్యోతిష్కుడు. వృత్తి రీత్యా ఊళ్లు తిరుగుతుంటారు. అలాగే ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఆనందపురం వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. రాత్రికి తిరిగి రాకపోవడంతో మరుసటిరోజు పదో తేదీన ఆయన కుమారుడు దుర్గాప్రసాద్ ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు కింద నమోదుచేసిన పోలీసులు పరిసర గ్రామాల్లో గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తుండగా 9వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బోయపాలెం నుంచి చేపలుప్పాడ వైపు వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తి పల్సర్ 220 వాహనం వెనుక తన తండ్రి కూర్చుని ఉన్నట్టు తనయుడు దుర్గాప్రసాద్ నాలుగు రోజుల కిందట గుర్తించారు. అప్పటి నుంచి కాపులుప్పాడ-చేపలుప్పాడ మార్గంలో గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం గంభీరం గెడ్డ సమీపంలో ఉన్న ఆర్ఎస్‌పి లేఅవుట్‌లోని ఒక ప్లాట్ కాంపౌండ్‌లో ఉన్న చిన్న షెడ్డు వద్ద శవం కాల్చిన ఆనవాళ్లు కనిపించాయి. పరిసరాల్లో పుర్రె, చేతి, కాలి ఎముకలు పడి ఉన్నాయి. ఈ సమాచారాన్ని భీమిలి, ఆనందపురం సీఐలకు అందజేశారు. విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజుతో సీఐలు బొడ్డేపల్లి సుధాకర్, సీహెచ్ వాసునాయుడు, సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకున్నారు. శవం కాలిబూడిదైన ప్రదేశంలో పడి ఉన్న రుద్రాక్షలు, ఎరుపు, పసుపు పూసలు దండలు, కనకదుర్గమ్మ ఫొటో, ఆకుపచ్చ పంచె అవశేషం గుర్తించి అవన్నీ తన తండ్రివేనని దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. తన తండ్రిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి దహనం చేసి ఉంటారని భోరున విలపించారు. క్లూస్ టీమ్ సంఘటనా స్థలిలో లభ్యమైన ఆధారాలను సేకరించింది. కాగా, సంబంధిత ప్రహరీలోపల గల షెడ్డు వద్ద రక్తపు మరకలు ఉండడాన్ని పోలీసులు గమనించారు. ఈ శరీర భాగాల అవశేషాలను పోలీసులు సేకరించారు. ఏసీపీ అప్పలరాజు మాట్లాడుతూ కాలిబూడిదైన శరీరం అప్పన్నదేనని ఆయన కుమారుడు, బంధువులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నందున ఆ దిశగా దర్యాప్తు చేస్తామన్నారు. త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు. కాగా, అప్పన్న కుమారుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తన చిన్నాన్న కుమారుడి పెండ్లికార్డులు పంచడానికి ఈనెల 8న విజయనగరం వెళ్లారని, అదేరోజు ఎవరితోనే ఫోన్‌లో ఎక్కువసేపు, గట్టిగా మాట్లాడడం గమనించానన్నారు. ఆ ఫోన్ కాల్‌పైనే అనుమానం ఉందన్నారు. దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భీమిలి పోలీసు సీఐ సుధాకర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు

టీడీపీ, జనసేన మద్దతు

ఆయన గెలుపు కోసం క్యాడర్ కృషిచేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా పిలుపు

- బీజేపీ నాయకులతో కూడా చర్చిస్తున్నట్టు వెల్లడి
- పోటీ నుంచి తప్పుకున్న సుంకరి శ్రీనివాసరావు
- రఘువర్మకు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటన


విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు తెలుగుదేశం, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వనున్నట్టు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉత్తరాంధ్ర సమస్యలపై పోరాటం చేసే వ్యక్తిగా రఘువర్మకు పేరు ఉందన్నారు. ఈనెల 27న జరగనున్న ఎన్నికల్లో రఘువర్మ గెలుపునకు టీడీపీ, జనసేన క్యాడర్ కృషిచేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బీజేపీ కూడా మద్దతు పలికేలా ఆ పార్టీ నాయకులతో చర్చిస్తున్నామన్నారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ రఘువర్మకు వంటివారు శాసన మండలిలో ఉంటే విద్యా రంగ సంబంధమైన అంశాలపై మంచి నిర్ణయాలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉన్న సుంకరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం, మంత్రి నారా లోకేశ్ సూచన మేరకు బరి నుంచి తప్పుకుని రఘువర్మకు మద్దతు ఇస్తున్నానని ప్రకటించారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసినందున సాంకేతికంగా ఉపసంహరణకు అవకాశం లేదన్నారు. బ్యాలెట్‌లో తన పేరు ఉన్నప్పటికీ తనకు ఎవరూ ఓటు ... మిగతా 6వ పేజీలో

1,140 మందికి వీఆర్ఎస్

స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఆమోదం

- నెల రోజుల గడువుతో నోటీసులు జారీ
- ఒక్కొక్కరికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ వస్తాయని అంచనా
- ఇప్పటికే రూ.500 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- మరో 386 మంది దరఖాస్తులు తిరస్కృతి



విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో 1,140 మంది ఉద్యోగుల స్వచ్ఛంద పదవీ విరమణకు యాజమాన్యం అనుమతించింది. ఈ మేరకు వారందరికీ నెల రోజుల గడువుతో బుధవారం ఆన్‌లైన్‌లో ముందస్తు నోటీసులు జారీచేసింది.

గత నెలలో వీఆర్ఎస్‌కు సంబంధించి యాజమాన్యం ప్రకటన చేయగా, మొత్తం 1,613 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించిన కమిటీ వారిలో 1,140 మంది అర్హులని తేల్చింది. మరో 386 మందికి అర్హత లేదని దరఖాస్తులు తిరస్కరించింది. ఇంకొక 87 మంది ఉద్యోగులు అర్హులు అయినప్పటికీ ఆయా విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు ఆ ఉద్యోగులు తమకు అవసరమని, వారికి వీఆర్ఎస్ ఇవ్వవద్దని సూచించడంతో పెండింగ్‌లో పెట్టింది. ఆ 87 మందిలో ఎవరైనా కుటుంబ అవసరాల రీత్యా వీఆర్ఎస్ అవసరమని అప్పీల్ చేసుకుంటే పరిశీలించి ఆమోదించే అవకాశం ఉంది.

ఇదిలావుండగా వీఆర్ఎస్ నోటీసులు జారీ చేసిన ఉద్యోగులకు యాజమాన్యం కొన్ని సూచనలు చేసింది. సెటిల్‌మెంట్ జరిగేలోపు నెలకు నాలుగు రోజుల కంటే ఎక్కువ సెలవులు పెట్టకూడదని స్పష్టం చేసింది. అలా చేస్తే జీతంలో కోత వేస్తామని హెచ్చరించింది. అత్యవసరమైతే డైరెక్టర్ అనుమతితో అదనంగా మరో మూడు రోజులు తీసుకోవచ్చునని తెలిపింది. వీఆర్ఎస్ సెటిల్‌మెంట్ కోసం ఉక్కు మంత్రిత్వ శాఖ రూ.500 కోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ చేసింది. ఉద్యోగుల సర్వీస్, మిగిలిన కాలాన్ని బట్టి ఒక్కొక్కరికి కనీసం రూ.10 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.50 లక్షల వరకూ వచ్చే అవకాశం ఉందని యూనియన్ నాయకులు చెబుతున్నారు. మంత్రిత్వ శాఖ ఇచ్చిన రూ.500 కోట్లలో కొంత మొత్తం మిగిలే అవకాశం ఉందని అంటున్నారు.

కోర్టుల నుంచి నోటీసులు

స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు వారి వ్యక్తిగత అవసరాల కోసం వివిధ బ్యాంకులు, రుణ సంస్థల నుంచి అప్పులు తీసుకున్నారు. వాటికి నెల వారీ వాయిదాలు చెల్లిస్తున్నారు. కొందరు వీఆర్ఎస్ తీసుకొని వెళ్లిపోతే నెలసరి వాయిదాలు కట్టలేరని, వారు తమ రుణాలు పూర్తిగా చెల్లించిన తరువాత ఫైనల్ సెటిల్‌మెంట్ చేయాలంటూ ఆయా సంస్థలు కోర్టుల నుంచి నోటీసులు పంపుతున్నాయి. ఇలాంటివి ఇప్పటికే ఓ 30 వరకూ వచ్చినట్టు చెబుతున్నారు.

పెందుర్తి భూములపై పెద్దల ఆరా

- లోతైన విచారణ చేపట్టాల్సిందిగా కలెక్టర్‌కు ఆదేశం
- విశాఖ ఆర్డీవోకు బాధ్యతలు
- రిటైర్డ్ తహశీల్దార్ పేరు ఎక్కడా లేదంటున్న స్థానిక తహశీల్దార్



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

పెందుర్తిలో రిటైర్డ్ తహశీల్దార్ ఖాతా నంబర్‌పై 400 ఎకరాలు ఉన్న అంశంపై లోతైన విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌ను అమరావతి పెద్దలు ఆదేశించారు. ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం ప్రచురించిన కథనంపై రాజధాని అధికారులు జిల్లా బాధ్యులను వివరణ కోరారు. కంప్యూటర్ ఆపరేటర్ తప్పిదం వల్ల అలా జరిగిందని ఇటు నుంచి సమాధానం ఇచ్చారు. దానికి వారు సంతృప్తి చెందలేదు. సాంకేతికంగా అనేక అనుమానాలు ఉన్నాయని, లోతుగా విచారణ చేయాలని ఆదేశించారు. అసైన్డ్ భూములపై చేసిన విచారణలా ఇది ఉండకూడదని కూడా వ్యాఖ్యానించినట్టు తెలిసింది. దీంతో అసలేం జరిగిందో తెలుసుకోవాలని ఆర్‌డీఓ శ్రీలేఖను జిల్లా అధికారులు ఆదేశించారు. దాంతో ఆమె పెందుర్తి వెళ్లారు. ఈ అంశంపై పెందుర్తి తహశీల్దార్ ఆనందకుమార్ మాట్లాడుతూ, 2017-18 మధ్య కాలంలో వ్యవసాయ భూములన్నీ ఆన్‌లైన్ చేసి, వాటికి ఆధార్ నంబర్ అనుసంధానం చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఆ సమయంలో రైతులు ... మిగతా 6వ పేజీలో

గంజాయి రవాణాదారులపై షీట్లు

- వినియోగదారులపై కూడా...
- ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలతో డీఐజీ గోపినాథ్ జట్టీ వీడియో కాన్ఫరెన్స్
- మహిళల భద్రతపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిందిగా ఆదేశం



విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

గంజాయి రవాణాదారులు, వినియోగదారులపై షీట్లు ఓపెన్ చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టీ ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలతో ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపినాథ్ మాట్లాడుతూ గంజాయి రవాణాదారులు, విక్రయదారుల ఆస్తుల స్వాధీనం, పీడీ యాక్టు నమోదు, కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో ... మిగతా 6వ పేజీలో

ఏయూలో గుట్టుగా బదిలీలు

అకడమిక్ స్టాఫ్ కాలేజీకి రిజిస్ట్రార్ కార్యాలయ అధికారి

- మరో ఇద్దరికి కూడా కీలక స్థానాలు
- ఐపీఆర్‌లో రీసెర్చ్ అసోసియేట్‌గా మరొకరికి అవకాశం
- ఉన్నతాధికారిని ప్రశ్నించిన సీనియర్లు



విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఆంధ్ర విశ్వ విద్యాలయంలో బదిలీలు నిర్వహించినట్టు తెలిసింది. ముగ్గురు అధికారులను బదిలీ చేయడంతోపాటు మరో అధికారికి కీలక విభాగంలో పోస్టింగ్ ఇచ్చినట్టు తెలిసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారానికి సంబంధించిన వివ రాలు ఇలా ఉన్నాయి. వర్సిటీలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే ఒక అధికారిని అకడమిక్ స్టాఫ్ కాలేజీకి బదిలీ చేశారు. ఆయనతోపాటు మరో ఇద్దరు అధికారులను ప్రస్తుతం పనిచేస్తున్న విభాగాల నుంచి కీలక విభాగాలకు బదిలీ చేశారు. ఈ ప్రక్రియ వారం రోజుల కిందట చేపట్టినప్పటికీ ఎన్నికల కోడ్‌కు ముందే చేసినట్టు ఉత్తర్వుల్లో చూపించారు. అలాగే, సోషల్ వర్క్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్‌కు అత్యంత కీలకమైన ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీసీ)లో రీసెర్చ్ అసోసియేట్ బాధ్యతలను సదరు ఉన్నతాధికారి అప్పగించినట్టు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారిని వర్సిటీకి చెందిన కొందరు సీనియర్ ప్రొఫెసర్లతోపాటు రిటైర్డ్ ప్రొఫెసర్ ఒకరు ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ తరహా నియామకాలు ద్వారా వర్సిటీకి చెడ్డపేరు వస్తుందని చెప్పినట్టు తెలిసింది. రిజిస్ట్రార్‌కు కూడా ఈ విషయాన్ని తెలియజేసినట్టు చెబుతున్నారు. ఐపీఆర్‌కు ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ప్రస్తుతం రిజిస్ట్రార్ వ్యవహరిస్తున్నారు. ఆయనకు తెలియకుండానే ఈ నియా మకం చేశారు. అక్కడ పనిచేసే మరో అధికారి రిజిస్ట్రార్‌కు విషయాన్ని తెలియజేయగా...సీనియర్ అసిస్టెంట్‌ను పిలిచి తెలుసుకున్నట్టు తెలిసింది. ఆ నియామకాన్ని నిలుపుదల చేయాలని తాజాగా ఆదేశించినట్టు చెబుతున్నారు.

పరిశోధకుల ఆందోళన కారణం అదేనా.?

టీడీఆర్ హబ్‌లో ప్రవేశాలు పొందిన పరిశోధక విద్యార్థులు కొందరు రెండు రోజుల కిందట ఆందోళన చేశారు. అది మాజీ వీసీ ప్రసాదరెడ్డి సూచనలతో వర్సిటీలోని మరో అధికారి అండదండలతో జరిగిందన్న ప్రచారం ఉంది. ఈ ప్రక్రియను నిలుపుదల చేయాలని ఉన్నత విద్యా శాఖ నుంచి ఆదేశాలు వచ్చిన నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకే ఆందోళనకు పురిగొల్పినట్టు చెబుతున్నారు. అయితే, దీనిని పరిశోధక అభ్యర్థులు తోసిపుచ్చుతున్నారు. తమకు అన్యాయం జరిగింది కాబట్టే ఆందోళన చేశామని పేర్కొంటున్నారు.

జీవీఎంసీ ఇంజనీరింగ్‌లో ఇష్టారాజ్యం

కాంట్రాక్టర్లుగా వర్క్ ఇన్‌స్పెక్టర్లు!

- అస్మదీయులైన కాంట్రాక్టర్ల పేరుతో టెండర్లు వేసి పనులు దక్కించుకుంటున్న వైనం
- కుటుంబసభ్యుల పేరుతో మరికొందరు
- నాణ్యతకు తిలోదకాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో కొంత మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తుతున్నారు. అస్మదీయులైన కాంట్రాక్టర్ల పేరుతో టెండర్లు వేసి పనులు చేస్తున్నారు. మరికొందరైతే కుటుంబ సభ్యులను కాంట్రాక్టర్లుగా రిజిస్ట్రేషన్ చేయించి, టెండర్లలో పాల్గొంటున్నారు. ఉన్నతాధికారులు చూసీచూడనట్టు ఊరుకోవడంతో కాంటాక్టర్లుగా మారుతున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది.

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో 325 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరిలో 110 మంది పర్మనెంట్ ఉద్యోగులు కాగా, మిగిలినవారందరూ అవుట్‌సోర్సింగ్. వీరంతా నీటి సరఫరా విభాగంలోని ప్రాజెక్ట్స్, నిర్వహణ, యూజీడీ నిర్వహణ, ప్రాజెక్టులు, పబ్లిక్ వర్క్సు విభాగాల్లో పనిచేస్తున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లంతా తమకు కేటాయించిన వార్డుల్లో జరిగే అభివృద్ధి, నిర్వహణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించాలి. పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలి. సంబంధిత వార్డు ఏఈలకు సహాయకులుగా ఉండాలి. అయితే కొంత మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఏకంగా కాంట్రాక్టర్ల అవతారం ఎత్తుతున్నారు. తమ పరిధిలో అభివృద్ధి లేదా నిర్వహణ పనులకు తమకు అస్మదీయులైన కాంట్రాక్టర్ల పేరుతో టెండర్లు వేస్తున్నారు. మరికొందరు తమ కుటుంబ సభ్యుల పేరుతో టెండర్ వేసి పనులు దక్కించుకుంటున్నారు. ఆయా పనులను కూలీలను పెట్టుకుని వారే పూర్తిచేస్తున్నారు. నాణ్యత లేకుండా పనులను తూతూమంత్రంగా పూర్తిచేస్తున్నారు. ఆపై తమ పైఅధికారుల ద్వారా ఎంబుక్ రికార్డు చేయించి బిల్లు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. ఒకేసమయంలో ఉద్యోగంతోపాటు కాంట్రాక్టర్‌గా పనులు చేస్తుండడంతో భారీగా ఆదాయం సమకూరుతోంది.

జోన్-8 పరిధిలో నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న ఒక అవుట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్, మరొక పర్మినెంట్ వర్క్ ఇన్‌స్పెక్టర్ తమ పరిధిలో అస్మదీయులైన కాంట్రాక్టర్ల పేరుతో టెండర్లు వేసి, పనులు దక్కించుకుంటున్నారు. అలాగే జోన్-8 పరిధిలోనే పబ్లిక్ వర్క్స్ విభాగంలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ తన తండ్రి పేరుతో పనులు చేస్తున్నారు. జోన్-5ఏలో అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్, మరొక పర్మినెంట్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘంలో నాయకులుగా ఉన్న ఇద్దరి పేర్లతో పనులు చేస్తున్నారు. వీటన్నింటిపైనా ఆయా జోన్ల లోని ఇంజనీరింగ్ అధికారులకు ... మిగతా 6వ పేజీలో

24న పీఎం కిసాన్ నిధులు విడుదల

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

పీఎం కిసాన్ పథకం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చివరి విడతగా రెండు వేల రూపాయలు ఈనెల 24న రైతుల ఖాతాకు జమ కానున్నాయి. విశాఖ జిల్లాలోని నాలుగు గ్రామీణ మండలాల్లో 17 వేల మంది రైతుల ఖాతాలకు రూ.3.5 కోట్లు జమ కానున్నాయి. రైతులకు ఆర్థిక సాయం చేయడానికి 2019లో ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ పథకం ద్వారా ఇప్పటివరకూ 18 పర్యాయాలు రెండు వేల వంతున ఇచ్చారు. 19వ పర్యాయం ఈనెల 24న మరో రెండు వేల రూపాయలు జమ చేయనున్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందజేత



సాయిబాబాకు మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్

మధురవాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న జీవీఎంసీ 7వ వార్డుకు చెందిన పోతిన సాయిబాబుకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.6.68 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం సాయిబాబాకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యం సమస్యలు ఉన్న వారికి ఆదుకుంటామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, జనసేన 7వ వార్డు పార్టీ అధ్యక్షుడు నాగోతి నరసింహనాయుడు, పోతిన బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలంలో వివిధ చోట్ల విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 21న కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెత్త కొమ్మలు తొలగిస్తుండడంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ అన్నవరం, కంచేరుపాలెం, పెదనాగమయ్యపాలెం, చిన నాగమయ్యపాలెం, ఎర్రయ్యపాలెం, ఆశిపాలెం తదితర గ్రామాలలో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కొమ్మాదిలో..

కొమ్మాది : పీఎంపాలెం ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతుండడంతో జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, ఏఎస్ఆర్ లే అవుట్, తులసీనగర్, లక్ష్మీవానిపాలెం, గాయత్రి లే అవుట్, ఏపీహెచ్‌బీ కాలనీ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపి వేయనున్నట్టు ఎలక్ట్రికల్ ఏఈ తెలిపారు.

ప్రయాణికుల ఆటోల్లో పరిమితికి మించి సరకు రవాణా

- జాతీయ రహదారిపై యథేచ్ఛగా సంచారం
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- ఎంత అప్రమత్తం చేసినా వినడం లేదంటున్న పోలీసులు



అధిక లోడుతో సరుకు నింపుకొని వెళుతున్న ఆటో

తగరపువలస, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల కోసం ఉపయోగించాల్సిన ఆటోలను కొందరు ఆటోవాలాలు అధిక సరకు రవాణాకు ఉపయోగిస్తుండడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరకు రవాణాకు ప్రత్యేకంగా తొట్టె ఆటోలను వినిగించాల్సి ఉంటుంది. కానీ జాతీయ రహదారిపై సైతం ప్రయాణికుల ఆటోల్లో పరిమితికి మించి యథేచ్ఛగా సరుకు రవాణా చేస్తుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని పలువురు అంటున్నారు.

తగరపువలస, ఆనందపురం, పోలిపల్లి, చిపాడ, మజ్జివలస రూట్లలలో తరచూ ఈ సరకుల ఆటోలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ జాతీయ రహదారిపై ఉండడం గమనార్హం. ఆటోలలో ప్రయాణికుల్ని కూడా పరిమితికి మించి ఎక్కించకూడదు. ఒకపక్క నుంచి మాత్రమే కిందకు దిగడానికి అవకాశం ఉండాలి. మరోపక్క గ్రిల్స్‌ను ఏర్పాటుచేయాలి.ఆటోలకు సంబంధించి డ్రైవరు వివరాలు లైసెన్సులు వంటివి ఆటోలో ఉండాలి. పూర్తి వివరాలు నమోదు చేసి ఉండాలి. ఆటో ఏ ప్రాంతానికి చెందినదన్న కోడ్‌ను ఆటో వెనుక పక్క రాయాలి. కానీ చాలా ప్రాంతాల్లో తిరుగుతున్న ఆటోల్లో ఆ వివరాలేవీ ఉండడం లేదు. అందువల్ల ప్రమాదాలు జరుగుతున్నప్పుడు .. దర్యాప్తు విషయంలో పోలీసులు రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రయాణికుల్ని మాత్రమే ఎక్కించవలసిన ఆటోల్లో సామాన్లను రవాణా చేయకూడదు. కానీ చాలాచోట్ల ఈ నిబంధనలు పాటించడం లేదు. తగరపువలస, తదితర ప్రాంతాల్లో సంతలు జరుగుతున్నందున అక్కడ కూరగాయలు, పూలు అమ్మకాలు చేసేవారు ఈ విధంగా ఆటోల్లో సామగ్రిని తీసుకుని వస్తున్నారు. పోలీసులు ఆటోలకు సంబంధించి అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ ఫలితం ఉండడం లేదు. చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

భీమిలి రూరల్ పరిధిలో ఆనందపురం, భీమిలి, పద్మనాభం తదితర ప్రాంతాల్లో ప్రతి గ్రామంలో కనీసం నలభై, యాభై ఆటోలు ఉన్నాయి. వీటిలో చాలా ఆటోలు నిబంధనలను పాటించడం లేదు. ఆటోవాలాలు తప్పనిసరిగా ఖాకీ దుస్తులు ధరించాలని నిబంధనలు ఉన్నప్పటికీ పట్టించుకునే వారే లేదు. పోలీసులు మెతక వైఖరి అవలంబిస్తుండడం వల్లే ఆటోవాలాల నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదకరంగా విద్యుత్ జంక్షన్ బాక్సులు



సింహాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పాత అడివివరం కూడలి నుంచి హనుమంతువాక మార్గంలో బీఆర్టీఎస్‌లో విద్యుత్ పోల్స్ కింద భాగాన విద్యుత్ వైర్లు కనెక్షన్లు ఇచ్చేందుకు జంక్షన్ బాక్స్‌లను ఏర్పాటు చేశారు. అప్పుడప్పుడు లైట్లు మరమ్మత్తులు చేపట్టాల్సి వచ్చినపుడు సిబ్బంది రిపేర్లు చేసిన తరువాత జంక్షన్ బాక్స్‌ల కప్పులు మూయటం మరిచి నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీంతో కొద్దిపాటి వర్షం పడితే చాలు వర్షపు నీటి తడికి విద్యుత్‌ఘాతం ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా బాటసారులు, మూగజీవాలు నడిచి వెళ్లే సమయంలో కూడా అనుకోని సంఘటనలు చేటు కలిగించేందుకు ప్రమాదం ఉందని అంటున్నారు.

ఫార్మర్ ఐడీ ఉంటేనే పీఎం కిసాన్

ఆనందపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఫార్మర్ ఐడీ ఉంటేనే పీఎం కిసాన్ పథకం వర్తిస్తుందని వ్యవసాయాధికారి సీహెచ్ సంధ్యారత్నప్రభ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతుకు ఒక ఐడీ సృష్టించి, తద్వారా పథకాలన్నీ అమలు చేయాలన్న ఆలోచనతో ఉందన్నారు. దీనినే ఫార్మర్ రిజిస్టరీగా తెలిపారు. ప్రతి రైతు ఆధార్ కార్డు, భూమి 1బి రికార్డు జెరాక్స్ కాపీలను స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి ఫార్మర్ ఐడీని జనరేట్ చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఫిబ్రవరి 28 తరువాత ఈ ఐడీ ఉన్న వారికి మాత్రమే పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రభుత్వం వేసే నగదు జమ అవుతుందన్నారు.

క్రీడా పోటీలతో గ్రామాల మధ్య సత్సంబంధాలు

భీమిలి ఎమ్మెల్యే గంటా



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే గంటా

ఆనందపురం ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా గ్రామాల మధ్య సత్సంబంధాలు పెంపొందుతాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో కీర్తిశేషులు మరుపిళ్ళ బంగారునాయుడు (బాబ్జీ) పేరిట నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతి ప్రదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గంటా మాట్లాడుతూ.. క్రీడల వల్ల దేహ దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తి అలవడుతుందన్నారు.

ఈ టోర్నమెంట్‌లో 15 జట్లు పాల్గొనగా, దుక్కవానిపాలెం జట్టుకు ప్రథమ స్థానం, మచ్చవానిపాలెం జట్టుకు ద్వితీయ స్థానం, పెద్దిపాలెం జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో నిర్వాకులు మరుపిళ్ళ సాయి జ్ఞానేశ్వర్, మరుపిళ్ళ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా వేణు

భీమునిపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : భీమిలి గ్రామదేవత శ్రీనూకాలమ్మ తల్లి ఉత్సవ నూతన కమిటీ అధ్యక్షుడుగా మత్స్యకార నాయకుడు అల్లిపిల్లి వేణుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం అమ్మవారి ఆలయం ఆవరణలో పట్టణ మత్స్యకార నాయకుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో కమిటీ 2025-26 ఎన్నిక నిర్వహించారు. ప్రముఖులు మైలపల్లి షణ్ముఖరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా, పట్టణ ప్రజలు, అమ్మవారి భక్తులు మత్స్యకార నాయకులు అల్లిపిల్లి వేణుబాబును నూతన ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా యెచ్చర్ల హరి, కోశాధికారిగా పి.స్నింటి ఎర్రయ్యరెడ్డిని, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పాసి వినోద్, కో-ఆర్డినేటర్‌గా గొరపల్లి సన్యాసిరావును ఎన్నుకున్నారు.

నగరపాలెంలో ఆవులకు ఆసరా



ఆవులకు నీడ కల్పిస్తున్న దాతలు

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భీమిలి రూరల్ గ్రామాల పరిధిలో ఆవులు, ఎద్దులను పోషిస్తున్న పలువురు ఉదయాన్ని వదిలిపెడుతున్నారు. ఇవి అనేక ప్రాంతాలలో విచ్చలవిడిగా సంచరిస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నాయి వీటి కోసం నగరపాలెం వద్ద దాతలు తాత్కాలిక షెల్టరును ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం పూట పశువులను ఈ ప్రాంతాలకు తీసుకుని రావచ్చునని పేర్కొన్నారు. జీరుపేట, చిల్లపేట, చిట్టివలస తదితర ప్రాంతాలలో వందలాది పశువులు రోడ్లమీద సంచరిస్తుంటాయి. ఆహారం కోసం కూరగాయల దుకాణాలలో చొరబడుతుంటాయి. వీటిని నిరోధించకపోతే గ్రామం అవతలకు తీసుకుని వెళ్లి వదిలిపెడతామని జీవీఎంసీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఫలితం ఉండటం లేదు. పెంపకందారులు ఉదయం పూట వదిలిపెడితే మళ్లీ రాత్రి ఏ సమయానికో చేరుతుంటాయి. వీటి కోసం భీమిలి రూరల్ గ్రామాలకు అనుకూలంగా ఉన్న నగరపాలెం వద్ద రహదారి వద్ద దాతలు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. వీటికి నీరు అందించడానికి ఏర్పాట్లు కూడా చేస్తున్నామని అన్నారు. పెంపకందారులు తమ పశువులను రోడ్లమీద వదిలిపెట్టకుండా అందరికీ అందుబాటులో ఉన్న ఈ ప్రాంతానికి పంపించాలని కోరుతున్నారు. కొన్ని ఆవులకు ఈ ప్రాంతం కొంతమేర అలవాటు ఉందని, రానున్నకాలంలో మరిన్ని ఆవులు చేరుతాయని దాతలు అంటున్నారు.

ఛత్రపతి శివాజీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటిస్తున్న గుణశేఖరన్, ప్రొఫెసర్లు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ 395వ జయంతిని బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. భారతీయతను, దేశభక్తిని నిండుగా కలిగి ఉండి మొఘలుల దాడుల నుంచి మరాఠా ప్రాంతాన్ని రక్షించుకోవడంలో అసమాన పోరాట పటిమను శివాజీ కనబరిచాడని, శివాజీ చిరస్మరణీయుడని గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ పేర్కొన్నారు. గీతం ఆవరణలోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. దేశ భక్తి, విజయ సాధన విషయంలో పోరాట పటిమను విద్యార్థులు ఛత్రపతి శివాజీ నుంచి స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీమ్‌సర్ ప్రో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, గీతం వివిధ విభాగాల డైరెక్టర్లు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్గదర్శినికి మరమ్మతులు చేయండి



సింహగిరి ఘాట్ రోడ్డులో దెబ్బతిన్న మిర్రర్

సింహాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సింహగిరి ఘాట్‌రోడ్డులో మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించేందుకు ఏర్పాటు చేసిన మార్గదర్శిని(కుంభాకార కటకం(మిర్రర్) మరమ్మత్తులు చేయాలని భక్తులు కోరుతున్నారు. గతంలో ఈ మలుపులో ప్రమాదాల నివారణకు నియమించిన గార్డును తొలగించి ఆ స్థానంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించేందుకు వీలుగా తద్వారా ప్రమాదాల నివారణను సాధించవచ్చు అని అధికారులు ఈ మార్గదర్శిని ఏర్పాటు చేశారు. కాని కొన్ని రోజులుగా ఈ మార్గదర్శిని మరమ్మత్తులకు గురైంది. దాంతో కొన్ని సందర్భాల్లో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణం దానిని మరమ్మత్తులు చేయించాలని లేదా కొత్త దానిని ఏర్పాటు చేయాలని లేకుంటే గార్డును నియమించి ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

అప్పన్న సన్నిధిలో వేడుకగా స్వాతి నక్షత్ర హవనం



:హవనం చేస్తున్న రుత్విక్‌లు



కల్యాణం చేస్తున్న అర్చకులు

సింహాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రాన్ని పురస్కరించుకుని సంప్రదాయబద్ధంగా స్వాతి నక్షత్ర హవనాన్ని నిర్వహించారు. ప్రతిమాసంలో స్వామివారి నక్షత్రం నాడు ఆర్జిత సేవగా స్వాతి హవనాన్ని చేయటం ఆచారంగా వస్తోంది. అదే క్రమంలో బుధవారం వేకువ జామున సుప్రభాత సేవతో అప్పన్నను మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను ఆలయ కల్యాణమండపంలో ప్రత్యేకంగా తీర్చిదిద్ది అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న 44 జంటల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. స్వామికి నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు జరిపించారు. తరువాత ఆగమోక్తంగా బింబారాధన, కలశారాధన, మండపారాధనలు జరిపారు. ఆలయ పోటు నుంచి వృద్ధాగ్నిని తెచ్చి ముందుగా సిద్ధం చేసిన హోమకుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు. తొలుత పంచ సూక్తాలు, తదుపరి నారసింహ, సుదర్శన మూల, మూర్తి మంత్రాలతో హవనాన్ని చేశారు. మహాపూర్ణాహుతి చేసిన తరువాత ప్రధాన కలశాన్ని శిరస్సున దాల్చి బేడామండప ప్రదక్షిణతో అంతరాలయంలో మూలవిరాట్ వద్ద ఉంచి పూజలు జరిపారు. పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ కావించారు. యజ్ఞభగవానునికి మంగళనీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు చేసి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేసి అంతరాలయంలో మూలవిరాట్ దర్శనం చేయించారు. హవనం ఏర్పాట్లను ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదేశాల మేరకు ఏఈఓ ఎన్.ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి జీవీవీఎస్‌కె ప్రసాద్ పర్యవేక్షించారు.

కనుల పండువగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్యకల్యాణం కనుల పండువగా సాగింది. బుధవారం ప్రభాత సేవలు ముగిసిన తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధనతో శ్రీకారం చుట్టి పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణధారణ నుంచి అక్షితారోపణ(తలంబ్రాలు) వరకు కల్యాణ క్రతువును నిర్వహించారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

కొత్త అంశాలపై పరిశోధనలు అవసరం



సదస్సులో మాట్లాడుతున్న కె.వేదవతి

సాగర్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గీతం, కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం సంయుక్తంగా 'రీసెర్చి ట్రెండ్స్ ఇన్ థెరప్యూటిక్ అప్లికేషన్స్ ఆఫ్ బయో యాక్టివ్ కాంపౌండ్స్' అనే అంశంపై గీతంలో బుధవారం జాతీయ సదస్సు ప్రారంభించాయి. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి మాట్లాడుతూ కొత్త అంశాలపై పరిశోధకులు దృష్టి సారించాలని సూచించారు. ప్రయోగశాలల అధిపతి ప్రొఫెసర్ బి.వి.ఆర్.టాటా మాట్లాడుతూ దాదాపు రూ.100 కోట్లతో అభివృద్ధి చేసిన ప్రయోగశాలల ద్వారా సముద్రశాస్త్ర అధ్యయనాలతో మానవాళికి ఉపయోగపడే బయోయాక్టివ్ కాంపౌండ్‌లను గుర్తించవచ్చునన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే జీవ మూలకాలకు ప్రయోజనం అధికంగా ఉంటుందన్నారు. ప్రొఫెసర్ ఎన్.సత్యనారాయణ, డాక్టర్ మీనాక్షి ముని, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ జి.రవికుమార్‌లు ప్రసంగించారు.

కాంట్రాక్టర్లుగా వర్క్ ఇన్‌స్పెక్టర్లు!

... 5వ పేజీ తరువాయి

పూర్తి సమాచారం ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకుండా వారిని ప్రోత్సహిస్తున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు కాంట్రాక్టర్లుగా మారిన వార్డుల్లో ఎవరైనా లెస్‌కు టెండర్ వేసి పనులు దక్కించుకున్నాసరే వారిని సవాలక్ష అభ్యంతరాలతో ఇబ్బందిపెట్టి మరోసారి పోటీగా టెండరు వేయకుండా చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటే కొత్తగా ఇంకెవరూ బినామీ పేర్లతో కాంట్రాక్టర్ల అవతారం ఎత్తరని పేర్కొంటున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు టీడీపీ, జనసేన మద్దతు

... 5వ పేజీ తరువాయి

వేయవద్దన్నారు. తన బదులు రఘువర్మకు ఓటు వేయాలని కోరారు.

ఉత్తరాంధ్రఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ ఒక పర్యాయం శాసన మండలి సభ్యునిగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషిచేశానని, మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తనకు తెలుగుదేశం, జనసేన మద్దతు ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ, పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ప్రధాన కార్యదర్శి పాల మరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరాక్రమానికి ప్రతీక ఛత్రపతి శివాజి



బాలికకు బహుమతి అందజేస్తున్న చంద్రంపాలెం ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి

కొమ్మాది, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ పరాక్రమానికి ప్రతీక ఛత్రపతి శివాజి అని ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి అన్నారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం శివాజి జయంతి, హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ శివాజీకి తల్లి భయం తెలియకుండా బాల్యంలోనే ధైర్యాన్ని నూరిపోసి పెంచిందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్స్, గీతాలు, పీపీటీ ప్రజెంటేషన్లు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పఠన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆనందపురం: శొంఠ్యాం నీలకుండీలు వద్ద గల శ్రీ సాయిస్వామి వివేకానంద పాఠశాలలో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ "మీ రక్తాన్ని ధార పోయండి.. మీకు దేశద్రోహుల నుంచి విముక్తి కలిగిస్తానని' పిలుపునిచ్చిన సమరయోధుడు శివాజీ అని కొనియాడారు. వీర శివాజీ దేశ వ్యతిరేకులకు సింహస్వప్నం లాంటివారని అన్నారు.

'శ్రీనివాసులనాయుడుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి'



భీమిలిలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడుకు మద్దతుగా బుధవారం సాయంత్రం పలువురు ప్రధానోపాధ్యాయులు, టీచర్లు ప్రచారం చేశారు. ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి అభ్యర్థించారు. ఈ ప్రచారంలో పీఆర్‌టీయూ, ఎస్‌టీయూ నాయకులు డి.శ్రీనివాసరావు, కె.సన్యాసినాయుడు, కృష్ణారావు, పరదేశి, రోమర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సీతాన్వేషణ ఘట్టం

కొనసాగుతున్న 'చాగంటి' ప్రవచనాలు

కొమ్మాది, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సుగ్రీవుని భౌగోళిక పరిజ్ఞానం అద్భుతమని, హనుమ బుద్ధిబలం, వేగంతో తన ప్రభువు శ్రీరాముడి నమ్మకాన్ని పొందగలిగాడని ప్రముఖ ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా బుధవారం కిష్కింధకాండలో వానరులంతా సీతాన్వేషణకు బయలుదేరిన ఘట్టాన్ని వివరించారు. సుగ్రీవుని ఆజ్ఞను అనుసరించి ఎంతో బలం కలిగిన కొన్ని కోట్ల కోతులు, కొండముచ్చులు, భల్లూకాలు కిష్కిందకు చేరుకోగా ఆ ప్రాంతం మొత్తం వానరాలతో నిండిపోయిందన్నారు. అప్పుడు సుగ్రీవుడు సీతాన్వేషణకు ఎవరెవరు ఏ దిక్కుకు వెళ్లాలో నిర్ణయించి తూర్పు వైపు వినతుని, పశ్చిమకు శతబలుని, దక్షిణానికి అంగదుడి నాయకత్వంలో వానరాలను పంపాడన్నారు. తనకున్న భౌగోళిక పరిజ్ఞానంతో సుగ్రీవుడు మేరుపర్వతానికి ఏ దిక్కున ఎంతదూరం వెళితే పర్వతాలు, నదులు, సాగరాలు వస్తాయి? వాటి సౌందర్యం, అక్కడ పొంచి ఉన్న ప్రమాదాల గురించి వివరించగా, శ్రీరాముడు ఆశ్చర్యపోయాడని తెలిపారు. రామాయణంలో చెప్పిన భౌగోళిక విషయాలు కొన్ని నామాంతరం చెందినప్పటికీ, ఇప్పటికీ అలాగే ఉండటం రామాయణం పరమ సత్యమని తెలియచేయటానికి తార్కాణమని తెలిపారు. వానరుల సీతాన్వేషణ, సుగ్రీవుడు హనమను పిలిచి బాధ్యతను గుర్తుచేయటం వంటి ఘట్టాలను చాగంటి వివరించారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మి దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ కారిడార్‌లో స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం



స్పీడ్ బ్రేకర్లు వేయిస్తున్న కార్పొరేటర్ పీవీ

సింహాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి నిత్యం వేలాదిగా వచ్చే వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్‌లో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. దానిలో భాగంగా వార్డు కార్పొరేటర్ పి.వి. నరసింహం సూచనల మేరకు పాత అడివివరం కూడలి నుంచి సింహాచలం తొలిపావంచా కూడలి వరకు పలు కూడళ్లలో స్పీడ్ బ్రేకర్లు వేశారు.

గంజాయి రవాణాదారులపై షీట్లు

... 5వ పేజీ తరువాయి

బాధితులకు పరిహారం అందేలా చూడాలన్నారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

పోక్సో, మహిళలపై దాడుల కేసులను త్వరగా విచారణకు తీసుకువెళ్లాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఇంకా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారం, సైబర్ నేరాలు, నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు, ఇతర కేసులపై డీఐజీ సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీలు తుహిన్ సిన్హా, జిందాల్, అమిత్ బర్దార్, కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్వీ మాధవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెందుర్తి భూములపై పెద్దల ఆరా

... 5వ పేజీ తరువాయి

అందుబాటులో లేకపోవడంతో స్థానిక సిబ్బంది నాటి తహశీల్దార్ ఆధార్ నంబర్‌కు లింక్ చేసి ఉంటారని వివరించారు. 9102 నంబరుతో ఉన్నవన్నీ వ్యవసాయ భూములేనని, అవి సుధాకర్ నాయుడి పేరుతో లేవని, కాకపోతే ఆయన ఆధార్‌తో లింక్ అయి ఉన్నాయన్నారు.

తప్పు జరిగిందని తెలిసినా సరిదిద్దని వైనం

రికార్డుల్లో తప్పులు ఉన్నాయని, చనిపోయిన తహశీల్దార్ ఖాతా నంబర్‌పై ఒక్క పెందుర్తి మండలంలోనే 600 ఎకరాలు ఉన్నాయంటూ రమేశ్ అనే యువకుడు తహశీల్దార్‌కు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గతంలోనే ఫిర్యాదు చేశారు. ఆ భూముల విలువ రూ.2 వేల కోట్లు అంటూ పేర్కొన్నారు. వాటిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. తప్పులు సరిదిద్దే ప్రయత్నం చేయలేదు. ఇప్పుడు ఆ భూములకు మ్యుటేషన్లు కూడా చేస్తున్నారు. అవి ఎవరి పేర్ల మీదకు వెళుతున్నాయో వెల్లడించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

వీసీల నియామకంపై వీఎంఆర్డీఏ చైర్మన్ హర్షం



సిరిపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : యూనివర్సిటీల ఉపకులపతులను నియమించడంపై వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో వర్సిటీల ఉపకులపతుల నియామకంలో ప్రతిభకు పట్టం కట్టారన్నారు. వైసీపీ పాలనలో విద్యాలయాలు, రాజకీయ పార్టీ కేంద్రాలుగా, నేతలకు విడిదులుగా పని చేశాయని విమర్శించారు. వైసీపీ నేతల పుట్టిన రోజులు, వివాహ వేడుకలకు వేడుక కేంద్రాలుగా యూనివర్సిటీలను వాడేవారన్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులకు అన్నహారాలు లేక హాహాకారాలు వినిపించేవన్నారు. తమ కూటమి ప్రభుత్వ హయాంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో సామాజిక వర్గాలకు సమన్యాయం చేశారన్నారు. రాక్షస పాలనకు, రాముని రాజ్యానికి నిజమైన తేడాను ప్రజలు ఇప్పుడు గమనిస్తున్నారని ప్రణవ్‌గోపాల్ అన్నారు.

కంబాలకొండ సందర్శకుల కోసం రోడ్డు ఏర్పాటు



కంబాలకొండ ప్రవేశమార్గంలో వేసిన మట్టి రోడ్డు

ఆరిలోవ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కంబాల కొండ నేచర్ పార్కుకు వచ్చే సందర్శకుల సౌకర్యార్థంఅధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో సుమారు 600 మీటర్ల మట్టి రోడ్డును వేశారు. ఈ మట్టి రోడ్డు వేయడం వల్ల పార్కుకు వచ్చే వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని కంబాల కొండ ఫారెస్ట్ రేంజర్ శాస్త్రి తెలిపారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డులోని భానునగర్‌లో సర్వే నెంబరు 46/5పి స్థలంలో అనుమతులు లేకుండా నిర్మించిన అదనపు అంతస్తును టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం తొలగించారు. ఏసీపీ మధుసూదనరావు ఆదేశాలతో, 118 సచివాలయం టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి పద్మ తన సిబ్బందితో కలిసి నిర్మాణానికి అదనంగా వేసిన కాలమ్‌లను విరగొట్టారు. అనుమతులను అతిక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే చేస్తే ఊరుకునేది లేదని యజమానుదారులను హెచ్చరించారు.

సినిమా గైడ్

- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
- **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **మదగజరాజ:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 37, టమాటా 11, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 42, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 38, బీరకాయలు 56, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 12, క్యారెట్ 32 దొండకాయలు 30, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)52, బరబాటి 28, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 30, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 30, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	437
విజయనగరం	441
శ్రీకాకుళం	441

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

- ఎన్ఏపీ పథకం కింద గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు స్కిల్‌డెవలప్‌మెంట్ ట్రైనింగ్
- నెలకు రూ.4500 స్టైయిపెండ్
- అభ్యర్థుల డేటా సేకరిస్తున్న ఆర్పీలు



శిక్షణ పొందుతున్న నిరుద్యోగ అభ్యర్థులు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు ఉద్యోగ అనుభవంలో శిక్షణ కల్పించేందుకు కేంద్రప్రభుత్వం నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ (ఎన్ఏపీఎస్) ప్రారంభించింది. ఈ స్కీమ్ ద్వారా గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన యువతకు అప్రెంటీస్‌షిప్ నిర్వహిస్తుంది. ఇందుకోసం 'మెప్మా' (మిషన్ ఫర్ ఎలిమినేషన్ పోవర్టీ ఇన్ మునిసిపల్ ఏరియాస్) ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గంలో ఎన్ఏపీ ఎస్ సర్వే ప్రారంభించారు. కమ్యూనిటీ ఆర్గనైజర్లు(సీవో), రీసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)లు ఇంటింటికి వెళ్లి డిగ్రీ, ఇంజనీరింగ్ ఇతర కోర్సుల్లో ఉత్తీర్ణులైన యువత డేటా సేకరిస్తున్నారు. 2020-21 నుంచి 2024-25 మధ్య డిగ్రీ, ఇతర గ్రాడ్యుయేట్ రెగ్యులర్ ఉత్తీర్ణత సాధించిన వారిని మాత్రమే రిజిస్టర్ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఆశ సొసైటీ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కల్పించనున్నారు. శిక్షణ కాలంలో ప్రతి ఒక్కరికి నెలకు రూ.4500 స్టైయిపెండ్ రూపంలో చెల్లిస్తారు. ఈ మొత్తంలో రూ.వెయ్యి ఆశ సొసైటీకి అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుంది.

ఏడాది పాటు శిక్షణ అందించిన తర్వాత అసెస్మెంట్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన యువతకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సర్టిఫికెట్ అందిస్తారు. ఈ సర్టిఫికేట్ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది.

అప్రెంటీస్‌షిప్‌కు నమోదు ఇలా...

నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ యువత ఎక్కువ ఉన్నందున అందర్నీ ఆర్పీలు సర్వే చేయడం కాస్త కష్టమే. అందుకే 2020-21 నుంచి 2024-25 మధ్య గ్రాగ్యుయేట్ పూర్తి చేసి, ఖాళీగా ఉంటూ శిక్షణ తీసుకోవాలని ఆసక్తి ఉంటే తమ పరిధిలోని ఆర్పీలను సంప్రదించాలి. టెన్త్, ఇంటర్, గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణత ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ లింక్ బ్యాంకు ఖాతా వివరాలను ఆర్పీలకు సమర్పించాలి. మెప్మా ఇచ్చిన అప్రెంటీస్‌షిప్ వెబ్‌సైట్ లింక్‌లో ఆర్పీలు అభ్యర్థులను నమోదు చేస్తారు. అనంతరం ఆశ సొసైటీ నిర్వాహకులు అభ్యర్థుల వివరాలు పరిశీలించి రిజిస్టర్ చేసుకుని స్కిల్‌డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు.

ఈ కార్యక్రమానికి సంబంధించి క్షేత్రస్థాయిలో గ్రాడ్యుయేట్ నిరుద్యోగుల జాబితా సేకరించాలని సీవో, ఆర్పీలకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

రోస్టర్ తప్పులు సరిదిద్దాకే గ్రూప్-2 మెయిన్స్

- పలువురు నిరుద్యోగుల డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రోస్టర్ తప్పులు సరిదిద్దిన తర్వాతే గ్రూప్-2 మెయిన్స్ నిర్వహించాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఎంవీపీ కాలనీ సర్కిల్ వద్ద పలువురు ఉద్యోగార్థులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష రాసే అభ్యర్థులందరం సందిగ్ధంలో ఉన్నామని, మానసిక వేదనతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వ హయాంలోని అయిదేళ్లలో ఒకే ఒక్క గ్రూప్-2 నోటిఫికేషన్ ఇచ్చినా రోస్టర్ విధానంలో చాలా తప్పులు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అధికార పక్షాన్ని ప్రశ్నించిన విషయం గుర్తు చేశారు. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వం ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా తప్పులు సరిదిద్దకుండా 23న పరీక్ష నిర్వహణకు పూనుకోవడం అన్యాయమన్నారు.

కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని భావిస్తే, ఇలా చేయడం తగదన్నారు.

కంబాలకొండలో అందుబాటులోకి మూడు అతిథి గృహాలు

- రూ.15 లక్షలతో మరమ్మతు



కంబాలకొండలోని అతిథిగృహాలు

ఆరిలోవ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కంబాలకొండ నేచర్ పార్కులో పలు అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ట్రెక్కింగ్ జోన్ దారిలో మూడు అతిథిగృహాలు (గెస్ట్‌హౌస్)ను నిర్మిస్తున్నారు. గతంలో ఇక్కడ ఉన్న మూడు గెస్ట్ హౌస్‌లు శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో సుమారు రూ.15 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్నారు. వీటికి అన్ని హంగులు ఏర్పాటు చేస్తున్నారు. ఏసీతో పాటు అటాచ్డ్ బాత్‌రూం సౌకర్యం ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇందులో విశ్రాంతి తీసుకోవచ్చు అని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో గడపాలనుకునే వారికి ఇక్కడ చక్కని అనుభూతి కలుగుతుందని పేర్కొన్నారు.

వాట్సాప్ మెసేజ్ చూసి యువకుల రక్తదానం

- సమయానికి ఆదుకోవడంతో నిలిచిన రోగి ప్రాణం



రక్తదానం చేస్తున్న బృందంలోని ఓ యువకుడు

ఆరిలోవ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కేవలం వాట్సాప్ మెసేజ్ చూసి రక్తదానం చేసిన నలుగురు యువకులు ఓ రోగి ప్రాణం కాపాడారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా మానవతాదృక్పథంతో మెలగిన ఆ నలుగురు కుర్రాళ్లను పలువురు అభినందించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

జీవీఎంసీ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండెంట్ ఇంజనీరింగ్‌గా 35 ఏళ్లు పని చేసి పదవీ విరమణ పొందిన గణపతిరావు గుండెపోటుకు గురై అస్వస్థతకు లోనయ్యారు. ఆయన చికిత్స నిమిత్తం ఆరిలోవ హెల్త్ సిటీలో గలఅపోల వైద్యశాలలో చేరగా, బైపాస్ సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. ఇందుకోసం రక్తం అవసరం అయింది. ఇందుకోసం వాట్సాప్‌లో మెసేజ్ పెట్టగా, నలుగురు యువకులు వెంటనే స్పందించారు. రోగికి అవసరమైన ఎ పాజిటివ్ రక్తం ఇచ్చేందుకు ఎస్.చిరంజీవి (33), ఆకుల రమేశ్ (35), ఆర్.రేవంత్ (18), ప్రీతం వర్మ (18) ముందుకు వచ్చారు. దీంతో గణపతిరావుకు సజావుగా సర్జరీ జరిగింది. సమయానికి రక్తదానం చేసి ఆదుకున్న ఆ నలుగురు యువకులను గణపతరావు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బస్ బేలో లైట్లు ధ్వంసం : ఆకతాయిలపై పోలీసులకు ఫిర్యాదు




ఆకతాయిలు ధ్వంసం చేసిన స్థానంలో కొత్తగా ఏర్పాట్లు చేస్తున్న విద్యుత్ దీపాలు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న బస్సు బే లైట్లు వెలగకుండా ఫీజులను తొలగించిన ఆకతాయి విద్యార్థులపై ఎంవీపీ పోలీసులకు ఎలక్ట్రికల్ ఏఈ భాగ్యశ్రీ బుధవారం ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా వెలగని లైట్లను వెలిగించి, బస్టాప్‌లో విద్యుత్ వెలుగులను తిరిగి కల్పించారు. విద్యుత్ దీపాలు వెలగకుండా ఆకతాయి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఈ ప్రకటన ద్వారా హెచ్చరించారు.

భారత్ గౌరవ్ ట్రైన్‌లో చార్‌ధామ్ యాత్ర

- మే 8 నుంచి ప్రారంభం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీరేందర్‌సింగ్, రమేశ్

సిరిపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : చార్‌ధామ్ యాత్రకు వెళ్లాలనుకునే వారి కోసం మొదటి 'భారత్ గౌరవ్ ట్రైన్' అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వ యూనిట్ గఢ్వాల్ మండల్ వికాస్ నిగమ్ ప్రజా సంబంధాల అధికారి వీరేందర్‌సింగ్ రాణా తెలిపారు. బుధవారం జీవీఎంసీ ఎదురుగా ఉన్న ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక పర్యాటక రైలు హరిద్వార్, యమునోత్రి, గంగోత్రి, కేథారనాథ్, బద్రీనాథ్ ప్రాంతాలను కవర్ చేస్తుందన్నారు. 16 రోజుల పూర్తిస్థాయి ప్యాకేజీ టూర్ 2025, మే 8న ప్రారంభం కానుందన్నారు. ప్రస్తుతం బుకింగ్‌లు తెరచుకున్నాయన్నారు. 1 ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ కోచ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. గమ్యస్థానాలు, మార్గాల గురించి సమాచారం ఉంటుందన్నారు. ఎంటర్‌టైన్‌మెంట్ సిస్టమ్, సీసీటీవీ కెమెరాలు, టూర్ మేనేజర్, హౌస్ కీపింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది ప్రతి కోచ్‌లో ఉంటారన్నారు.

రైలు సేవా సంస్థ రీజనల్ మేనేజర్ రమేశ్ అయ్యంగార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎల్టీసీ, ఎల్ఎఫ్సీ సౌకర్యం ఉపయోగించుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు ఫోన్ : 91600 21414 లేదా www.tour-times.in సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.10 లక్షల బీమా : ఆర్ఎం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు రూ.10లక్షల బీమా సౌకర్యం వర్తింపజేస్తూ ఆర్టీసీ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ప్రకటించారు. ద్వారకా కాంప్లెక్సులోని ఆర్ఎం కార్యాలయంలో బుధవారం వివిధ విభాగాల అధికారుల, డిపోమేనేజర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దె బస్సుల డ్రైవర్లకు, అటెండర్లకు, గ్యారేజీలు, ఆర్టీసీ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి, అవుట్‌సోర్సింగ్ స్వీపర్లకు, ట్రాఫిక్ గైడ్‌లకు, కౌంటర్లలో టికెట్లు బుక్ చేసే ప్రధాన బస్టాపుల్లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వర్తిస్తుందన్నారు. అంత్యోదయ శ్రామిక్ సురక్ష యోజన కింద బీమా అమలవుతుందన్నారు. ఇందుకు గాను ఒక్కో కార్మికుడు ఏడాదికి రూ.499లు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో పోస్టల్ అధికారులు, ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు, డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో నాప్కిన్ యూనిట్ ప్రారంభం



న్యాప్కిన్ యూనిట్ ప్రారంభిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు, జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు

ఆరిలోవ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జైలులో గల మహిళా ఖైదీల్లో సాధికారత పెంపొందించడంతో పాటు వారికి కొంత ఆర్థిక భరోసా కల్పించేందుకు కారాగారంలో ఏర్పాటు చేసిన శానిటరీ న్యాప్కిన్ యూనిట్ దోహద పడుతుందని జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు పేర్కొన్నారు. కేంద్ర కారాగారంలోని మహిళా బ్యారెక్స్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ (విశాఖపట్నం) సౌజన్యంతో సెంట్రల్ జైలులో ఏర్పాటు చేసిన నాప్కిన్ తయారీ యూనిట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ నాణ్యత గల శానిటరీ న్యాప్కిన్స్ ఉత్పత్తి చేయడానికి యూనిట్ అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. హానికరమైన రసాయనాలు లేని ముడి పదార్థాలను మాత్రమే ఉపయోగించి వీటిని రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ యూనిట్ ద్వారా తయారైన ఉత్పత్తులను రాష్ట్రంలో గల అన్ని మహిళా కారాగారాలకు సరఫరాచేయనున్నట్టు తెలిపారు. తద్వారా మహిళా ఖైదీలకు కొంత ఆదాయం లభించడంతో పాటు భవిష్యత్తులో వారు ఉపాధికి మార్గం ఏర్పడుతుందన్నారు. ఇందుకు సహకరించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్‌ను సూపరింటెండెంట్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

'హిందీ భాష - ఆధునిక పోకడలు'పై చర్చ



ఆచార్య జయలక్ష్మికి సన్మానిస్తున్న అధ్యాపకులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని గాయత్రీ విద్యా పరిషత్‌లో బుధవారం 'హిందీ భాష - ఆధునిక పోకడలు' అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ద్వితీయ భాషా విభాగాధిపతి ఆచార్య పీకె జయలక్ష్మి ప్రసంగించారు. హిందీ అభివృద్ధి భవిష్యత్తు అవకాశాలతో పాటుగా ప్రపంచీకరణ, డిజిటల్ యుగంలో హిందీ ఎలా రూపాంతరం చెందుతుందో వివరించారు. హిందీ వాడకంలో కొత్త పోకడలు, సాంకేతిక ప్రభావాల గురించి కూడా వివరంగా చర్చించారు. గాయత్రీ విద్యా పరిషత్ ప్రిన్సిపాల్ ఆచార్య కేఎస్ బోస్, యూజీ డైరెక్టర్ డి.గిరిధర్, హిందీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిత, అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

సిరిపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సీబీఎం కాంపౌండ్‌లోని మహారాష్ట్ర మండల్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని బుధవారం సాయంత్రం తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను, వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావును ఘనంగా సత్కరించారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర మండల్ అధ్యక్షుడు విఠస్‌రావు పుదాలె, ఉపాధ్యక్షుడు జాదవ్, సుధా సాలు కే, అనిల్ జాదవ్, సందీప్‌షిండే, సబాజి యెవాలి, ప్రవీణ్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న జియో ఫిజిక్స్ విభాగం ప్రదర్శన



స్టాళ్లలో సామగ్రిని ఆసక్తిగా పరిశీలిస్తున్న విద్యార్థులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఏయూ జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో భూగర్భ గనుల శాఖ, ఇన్‌కాయిస్, ఫిషరీస్ విభాగం తదితర ప్రభుత్వ శాఖలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాళ్ల, వస్తువులను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సదస్సులో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత డాక్టర్ హరి నారియన్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ కేఎస్ కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సీవీ నాయుడు, ఐజీయూ ప్రతినిధి డాక్టర్ ప్రసాద్, ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎగుమతిదారుగా దేవీ ఫిషరీష్‌కు అవార్డు



కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్, పోర్టు చైర్మన్ అంగముత్తు చేతులమీదుగా అవార్డును స్వీకరిస్తున్న యార్లగడ్డ సూర్యారావు

సిరిపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ కస్టమ్స్ డే పురస్కరించుకుని నగరానికి చెందిన దేవీ ఫిషరీస్‌కు 'ఉత్తమ ష్రిమ్ప్స్ ఎక్స్‌పోర్టర్ 2024' అవార్డు లభించింది. ఈ మేరకు ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ కె.శ్రీధర్, విశాఖపట్నం పోర్టు చైర్‌పర్సన్ డా.ఎం.అంగముత్తుల నుంచి దేవీ ఫిషరీస్ మేనేజింగ్ డైరెక్టర్ యార్లగడ్డ సూర్యారావు అవార్డును స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో అందించిన సేవకు, కష్టానికి ఫలితంగా భావిస్తున్నామన్నారు.


క్రీడాకారులకు ఎమ్మెల్యే వెలగపూడి అభినందన



హ్యాండ్‌బాల్ క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 19 : ఈ నెల 22-26 తేదీల్లో జార్ఖండ్ రాష్ట్రం రాంచీ జిల్లాలో జరిగే 53వ సీనియర్ నేషనల్ టోర్నమెంటుకు మన రాష్ట్రం నుంచి విశాఖకు చెందిన అయిదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరిని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అభినందించారు. గత నెల నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నమెంటులో వీరి జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. జిల్లా హ్యాండ్‌బాల్ కార్యదర్శి ఎస్.రాజారావు, సత్యనారాయణరాజు, క్రీడాకారులు పూర్ణచంద్ సాయి, కె.వరప్రసాద్, ఎం.త్రివేష్, ఎం.స్వరూప్ కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ పార్కు సందర్శించిన ఫారెస్ట్ ట్రైనీలు



బయో డైవర్సిటీ పార్కు సందర్శించిన ట్రైనీ ఎఫ్‌బీవో, ఎఫ్ఎస్‌వోలు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జీవ వైవిధ్య పరిశీలన, పర్యావరణ యాత్రలో భాగంగా బుధవారం పెదవాల్తేరు రాణిచంద్రమణి దేవి ఆస్పత్రి ఆవరణలో గల బయోడైవర్సిటీ పార్కును ఏపీ ఫారెస్ట్ అకాడెమీ (రాజమండ్రి) డైరెక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 60 మంది ఎఫ్‌బీవో, ఎఫ్ఎస్‌వో ఆఫీస్ ట్రైనీలు సందర్శించారు. ఈ సందర్భంగా బయో డైవర్సిటీ పార్కును సందర్శించి పార్కులోని టానీ కోస్టర్ సీతాకోక చిలుక పూర్తి జీవిత చక్రాన్ని అన్ని దశలను చూసి ఆకర్షితులయ్యారు. అనంతరం జీవ వైవిధ్య ఉద్యానవనం నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి పలు అరుదైన మొక్కల గురించి వారికి వివరించారు. సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటరీ బోర్డులతో అధ్యయనం చేస్తున్న వందలాది ఔషధ మొక్కలను ట్రైనీలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్ఏ డెప్యూటీ డైరెక్టర్ శాంతిస్వరూప్, రాజమండ్రి డీఎఫ్‌వో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ కానుకల ఆదాయం రూ.15.5 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

జ్ఞానాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలో వేంచేసిన ఎర్నిమాంబ ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. జనవరి 10 నుంచి ఫిబ్రవరి 19 వరకు రూ.15.5 లక్షల ఆదాయం, సుమారు 58 గ్రాముల బంగారం, 8 కేజీల వెండి వచ్చింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఎం.నీలిమ, కె.శ్రీనివాసరావుల పర్యవేక్షణలో జరిగిన కానుకల లెక్కింపులో శ్రీహరి సేవా సంఘం సభ్యులు, ఆలయ ధర్మకర్తలు, పోలీసులు పాల్గొన్నారు.

23న ఇండియన్ మ్యాజిక్ అకాడమీ దశమ వార్షికోత్సవం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవం, ఇండియన్ మ్యాజిక్ అకాడమీ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న సాయంత్రం 5.30 గంటలకు కళాభారతిలో ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్ నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు బీఎస్ రెడ్డి తెలిపారు. ఈ ఉత్సవంలో పీసీ సర్కార్ తనయుడు జూనియర్ సర్కార్‌కు స్వర్ణాభిషేకం, జీవన సాఫల్య పురస్కారం అందజేస్తున్నట్టు తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ ఆటగాళ్లకు రైల్వే డీఆర్ఎం అభినందన



క్రీడా విజేతలతో డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, ఇతర ప్రముఖులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇండియన్ రైల్వే జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వాల్తేరు డివిజన్ క్రీడాకారులు సీహెచ్.వెంగళరావు, డి.వి.గణేష్, పి.కార్తీక్‌లను డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు బుధవారం తన చాంబర్‌లో అభినందించారు. కర్ణాటకలో జరిగిన ఈ టోర్నీలో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి భారతీయ రైల్వే జట్టు విజయంలో కీలక పాత్ర వహించడమే కాకుండా స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు అందుకున్న వెంగళరావు డివిజన్ ఖ్యాతిని నిలబెట్టాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్సు ఆఫీసర్లు ప్రవీణ్ బాటి, అవినాష్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్, సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రసూల్ పాల్గొన్నారు.

నడకను ప్రోత్సహిద్దాం కార్యక్రమం నేడు

మాధవధార, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఖర్చులేని ఆరోగ్య సాధనం నడకని మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ అన్నారు. పచ్చని వాతావరణంలో అలరారే మురళీనగర్ వాకర్స్‌క్లబ్ పార్కు ప్రాంగణాన్ని నడకకు వినియోగించుకోవాలని సూచించారు. నడకను ప్రోత్సహించేందుకు గురువారం ఉదయం ఉడికించిన గుడ్డు, అరటి పండు ప్రతి ఒక్కరికీ అందిస్తామని తెలిపారు.

బజార్లలో రైతులు పండించిన కూరగాయలనే విక్రయించాలి



కంచరపాలెం రైతు బజార్‌లో మహిళతో మాట్లాడుతున్న విజిలెన్స్ డీడీ పాపారావు

కంచరపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన కూరగాయల ఉత్పత్తులనే రైతుబజార్లలో అమ్మాలని, టోకు మార్కెట్ల నుంచి కొనుగోలు చేయరాదని విజిలెన్స్ టీం డిప్యూటీ డైరెక్టర్ పాపారావు, జిల్లా విజిలెన్స్ డీడీ కిరణ్ స్పష్టంచేశారు. బుధవారం కంచరపాలెం రైతుబజార్‌ను వారు సందర్శించారు. అన్ని దుకాణాలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గ్రామాల్లో పంట ఉత్పత్తులు ఎక్కువ ఉంటే వాటిని సేకరించి బజార్లలో విక్రయించే అవకాశం కల్పిస్తామన్నారు. డీఏటీఎంవో యాసిన్, ఏఎంసీ కార్యదర్శి అరుణ, లక్ష్మి చైతన్య, ఎస్టేట్ అధికారి జగదీష్ పాల్గొన్నారు.

సంతృప్తిగా భోజనం చేయండి



ఆర్‌బీఎంయూపీ పాఠశాలను సందర్శించిన ఎంఈవో-2 పుష్యరాగం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజనం అందిస్తున్నందున విద్యార్థులు కడుపునిండా తినాలని మండల విద్యాశాఖాధికారిణి-2 ఎం.పుష్యరాగం కోరారు. జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పదార్థాల రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం హనుమంతు ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్ల ఆక్రమణ

జ్ఞానాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రహదారులపై ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసిన బీఆర్‌టీఎస్ సర్వీస్‌రోడ్లను కొందరు వ్యాపారులు, దళారులు పార్కింగ్ కేంద్రాలుగా మారుస్తున్నారు. జ్ఞానాపురం ఫ్లైవంతెన దగ్గర నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. ఫుట్‌పాత్‌కు ఆనుకుని ఉన్న దుకాణాల యజమానులు కొందరు మరో అడుగు ముందుకేసి తోపుడుబళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను చిల్లర వ్యాపారులకు రోజువారీ అద్దెకు ఇచ్చి రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు. జ్ఞానాపురం మెయిన్ రోడ్డులో ఉన్న వ్యర్థాల సేకరణ దుకాణం వారు ఏకంగా రోడ్డును సగం ఆక్రమించి పెద్దపెద్ద బస్తాలను రోడ్డుపై పడవేస్తున్నారు. దీంతో సర్వీసు రోడ్డు ద్వారా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు .గతంలో ఈ సమస్యపై



జ్ఞానాపురం రోడ్డుపై సగానికిపైగా వేసిన బస్తాలు



రోడ్డును ఆక్రమించి దుకాణాల ఏర్పాటు

ఫిర్యాదులు రావడంతో అప్పటి కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు యుద్ధప్రాతిపదికన టౌన్ ప్లానింగ్ సిబ్బంది సాయంతో ఆక్రమణలు తొలగించి ఫుట్‌పాత్‌లపై పాదచారులు నడిచేలా మార్గాన్ని సుగమం చేశారు. సీఐ బదిలీపై వెళ్లిన అనంతరం పరిస్థితి మొదటికొచ్చింది. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, క్షేత్ర స్థాయిలో చూడాల్సిన సచివాలయ, ప్లానింగ్ కార్యదర్శులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మరోపక్క ఫుడ్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి కాన్వెంటు జంక్షన్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులో పైపులైన్ల కోసం సగం తవ్వడంతో ట్రాఫిక్ మరింత జటిలమవుతోంది. దీనికితోడు ట్రక్కులు, వ్యాన్లు అనధికారికంగా అక్కడ నిలబెడుతున్నారు.

జ్ఞానాపురంలో విద్యాసంస్థలు ఎక్కువగా ఉండడంతో సర్వీసురోడ్డులో స్కూలు ఆటోలు నిలిపివేస్తున్నారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ రద్దీగా ఉన్నప్పుడు సర్వీసు రోడ్డులోకి వచ్చేందుకు వీలు లేనంతగా ఆక్రమణలతో చిక్కిపోతున్నాయి. పోలీసులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి రాకపోకలకు దారిచూపాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

పాఠశాలల బలోపేతానికి శిక్షణ తోడ్పాటు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖరరావు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ జోగ చంద్రశేఖరరావు తెలిపారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అంగన్వాడీలకు శిక్షణ ఇచ్చారు. భాషాభివృద్ధికి కృత్యాలు ఎలా వినియోగించాలి? ఆధారిత కృత్యాలు ఎలా అర్థం చేసుకోవాలి? అనే అంశంపై అవగాహన కల్పించారు. 3 నుంచి 6 ఏళ్ల మధ్య పిల్లలకు విద్యారంభంలోనే మెరుగైన పునాది వేయాలని చంద్రశేఖరరావు సూచించారు. అభ్యసనం మెరుగుపరచడం, ఆరోగ్య సంరక్షణ, వాటి అమలుకు అంగన్వాడీ కార్యకర్తలకు మెరుగైన శిక్షణ ఇస్తే అనుకున్న లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. పాఠశాల విద్య బలోపేతానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పథకం జిల్లా కో-ఆర్డినేటర్ ఎల్.శ్రీనివాస్‌లాల్, ఏఎంవో లక్ష్మి, ఎంఈవోలు రామారావు, బాలామణి, డీఆర్పీలు కె.సత్యనారాయణ, ఆర్.రాజ్‌కుమార్, ఎస్.రాజు, ప్రసన్న, వెనిసా సుందరి, సీఆర్పీ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

హైవే రోడ్డు లైట్లకు ఎట్టకేలకు మరమ్మతులు

మాధవధార, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ హైవే జంక్షన్‌లో విద్యుత్ దీపాలకు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. ప్రధానంగా ఎన్ఏడీ దాటాక అత్యధిక వాహనాలు జామ్ అవుతున్న చోట రాత్రి వేళ వాహన రాకపోకలు, హైవే రోడ్డు దాటుతూ ఇటు మాధవధార ఉడాకాలనీ నివాసిత ప్రాంతాలు సహా రామన్నకాలనీ, ఏకలవ్య కాలనీ, అంబేడ్కర్ కాలనీలకు చేరే నివాసితులు, ప్రయాణికులకు చిక్కులు ఎదురవుతున్నాయి. దీనిపై వచ్చిన ప్రజల అభ్యర్థన మేరకు జీవీఎంసీ ఏఈ అర్చన పర్యవేక్షణలో సిబ్బంది కొత్త లైట్లను అమర్చి విద్యుత్ కనెక్షన్ లోపాల్ని సరిదిద్దారు. ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్‌కు నిత్యం హైవే రోడ్డు దాటి వచ్చేవారు, ఉద్యోగులు బస్టాప్ దాటి కాలినడకన పోయేవారు వాహనాల వేగంతో ప్రమాదాల బారిన పడేవారు.

క్రమశిక్షణతో ఉన్నత భవిత: సీపీ బాగ్చి



మాధవధారలో మాట్లాడుతున్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, వేదికపై ఇతర ప్రముఖులు

మురళీనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్నత స్థానానికి చేరాలంటే క్రమశిక్షణ అవసరమని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. బాల్యం, విద్యార్థి దశ మరింత కీలకమని పేర్కొన్నారు. బుధవారం ఆయన మాధవధార హైస్కూల్‌లో శ్రీదేవి విజ్ఞాన్ జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తమ భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలా? అనే విషయమై విద్యార్థి దశలో ఆలోచించాలని హితవు పలికారు. ముఖ్యంగా టెన్త్, ఇంటర్మీడియట్ చదివే వయసులో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆ వయసులో తమకే అంతా తెలుసు అన్నట్టు ప్రవర్తించడం సర్వసాధారణంగా కనిపిస్తుందన్న సీపీ, ప్రేమ.. ఇతర ఆలోచనల్ని నియంత్రించుకుంటూ సరైన దారిలో అడుగేయాలన్నారు. వ్యసనాలకు బానిసలై జీవితాల్ని తప్పుడు మార్గంలోకి పోనీయకుండా పెద్దల మాట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలు ఆపద సమయంలో 112 నంబరులో సంప్రదించి పోలీసు రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకురాలు కీర్తి, 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో మాధవధార హైస్కూల్ హెచ్.ఎం. బి.హేమలత, ఏసీపీ పృథ్వీరాజ్, కంచరపాలెం సీఐ రవికుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, స్థానిక రాజకీయ పార్టీల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

ఆకట్టుకున్న రచయితల చర్చా గోష్ఠి



సమావేశంలో మాట్లాడుతున్న కె.వి.ఎస్. మూర్తి

సీతంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాల్లో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన 'ప్రాచీన సాహిత్యంలో ఆధునిక పోకడల'పై రచయితల చర్చా గోష్ఠి ఆహూతులను ఆకట్టుకుంది. సభకు అధ్యక్షత వహించిన సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సాహిత్యం ప్రాచీనమైనా, ఆధునికమైనా సమాజ వికాసానికి, సాంస్కృతిక, సనాతన వారసత్వం ప్రతిబింబిస్తూ ఉంటుందన్నారు. 15వ శతాబ్ది కవులు అన్నమయ్య, వేమనలు కూడా సమత, మమత, మానవతలు ప్రతిబింబించే రచనలు చేశారన్నారు. నిజమైన సాహిత్యం రమణీయం, రసపూర్ణం, రమ్యవర్ణనం కలిగి ఉండాలన్నారు. వక్తగా విచ్చేసిన ఆచార్య కె.వెంకట సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రపంచ సాహిత్యం మొదలుకొని భారతీయ, తెలుగు ప్రాచీన, ఆధునిక సాహిత్యాలపై చక్కని అవగాహన కల్పించారు. హృద్యంగా సాగిన ఆయన ప్రసంగంలో భాషలోనూ, వాటికి అనుగుణంగా సాహిత్యంలోనూ వస్తున్న మార్పులను వివరించారు. రచయిత చట్టిల్ల నిర్మలాదేవి తన సమీక్షలో ప్రాచీన సాహిత్యం ఔన్నత్యం, ఆధునిక పోకడలు పరిఢవిల్లిన తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సూరపనేని విజయకుమార్, సీహెచ్ చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, పోమంచి వినయభూషణరావు, చాగంటి జోగారావు, సీహెచ్ రామమోహన్ పాల్గొన్నారు.

ఆటోల రిజిస్ట్రేషన్‌పై ఆంక్షల ఎత్తివేత

మురళీనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి); విజయవాడ, విశాఖ నగరాల్లో ఆటోల రిజిస్ట్రేషన్లపై ఆంక్షల్ని తొలగిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయని విశాఖపట్నం ఉప రవాణా కమిషనర్ ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఇకపై బి.ఎస్-4, పెట్రోల్, ఎల్‌పీజీ, ఎలక్ట్రిక్ ఆటోలకు రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. చిరునామా మార్పు, యాజమాన్య బదిలీలపై పాత ఆటోలను విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో అనుమతించడం లేదన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

మహారాణిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మసీదులలో ఇమామ్, మౌజాన్‌లకు గౌరవ వేతన బకాయిలు విడుదల చేయటం, రంజాన్ మాసంలో ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులకు ఒక గంట వెసులుబాటు కల్పించే నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ చిన రహమాన్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ రహ్మతుల్లా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్‌లు వేర్వేరుగా హర్షం వ్యక్తం చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మసీదులలో ప్రార్థనలు చేసే ఇమామ్, మౌజాన్‌లకు 2024 ఏప్రిల్ నుంచి గౌరవ వేతనం బకాయిలు సుమారు రూ.45 కోట్లు విడుదల చేసి ప్రభుత్వం వారిలో ఆనందం నింపిందన్నారు. ఈ నిర్ణయం ముస్లిం సమాజానికి ఎంతో సంతోషం కలిగించిందని, కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. సీఎం, ఇతర పాలక పెద్దలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీసెల్ కార్యదర్శి మహ్మద్ గౌస్ మాట్లాడుతూ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించటానికి రంగం సిద్ధమవుతోందన్నారు. రంజాన్ తోఫా అందిస్తున్నట్లు ప్రకటించటం హర్షదాయకమని తెలిపారు మైనారిటీ నాయకులు మహ్మద్ జఫ్రుల్లా, మహ్మద్ ఇలియాస్, షేక్ అబ్దుల్‌బాషా, షేక్ యాసీన్‌బాబా పాల్గొన్నారు.

నాకౌట్ దశకు యూసీసీ టీ20 క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ ద ప్లేయర్ అవార్డు అందుకుంటున్న రైల్వేస్ ఆటగాడు కిషోర్‌కుమార్

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న 18వ యూసీసీ టీ20 క్రికెట్ టోర్నీ నాకౌట్ దశకు చేరింది. గురువారం జరిగే తొలి సెమీస్‌లో గెలాక్సీ సిసి-విజయనగరం జిల్లా క్రికెట్ సంఘం, రెండో సెమీస్‌లో కవలియర్స్-గాజువాక గ్రీన్స్ తలపడనున్నాయి. బుధవారం రైల్వే గ్రౌండ్‌లో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో తూర్పుకోస్తారైలే ఐదు పరుగుల తేడాతో సిటీ పోలీసుపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన రైల్వేస్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 173 పరుగులు చేసింది. కిషోర్‌కుమార్ హాఫ్ సెంచరీ (64) సాధించగా, కెప్టెన్ ఎంఎస్.దీపక్ (26), యోగేష్‌కుమార్ (20) రాణించారు. సిటీ పోలీసు బౌలర్లలో ఈశ్వర్, శ్రీకాంత్ చెరో రెండు వికెట్లు తీశారు. లక్ష్య ఛేదనలో చివరి బంతి వరకు పోరాడిన సిటీ పోలీసు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 168 పరుగులు చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందింది. కెప్టెన్ త్రినాథ్ అర్ధ సెంచరీతో (72; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) విరుచుకుపడగా, సంతోష్‌కుమార్ (39) సహకరించినా ఫలితం లేకపోయింది. రైల్వే బౌలర్ డేవిడ్ రాజు రెండు వికెట్లు పడగొట్టాడు. మరో మ్యాచ్‌లో గెలాక్సీ సిసి 78 పరుగుల తేడాతో సోలోస్ సిసిపై ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గెలాక్సీ సిసి నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 170 పరుగులు చేసింది. పాండురంగడు (46 నాటౌట్), హేమంత్‌రెడ్డి (28), పైల అవినాష్ (26), ధీరజ్ (22) రాణించారు. సోలోస్ బౌలర్లలో జోగి మూడు, సయ్యద్ బాజిద్‌షా రెండు వికెట్లు తీశారు. లక్ష్య ఛేదనలో సోలోస్ సిసి 18.2 ఓవర్లలో 92 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. కల్యాణ్‌కుమార్ (35) మినహా మిగిలినవారు పెవిలియన్‌కు క్యూ కట్టారు. గెలాక్సీ బౌలర్లలో కమిల్ మూడు...హేమంత్‌రెడ్డి, ప్రశాంత్ చెరో రెండు వికెట్లు తీశారు.

జింక్ గ్రౌండ్‌లో కవలియర్స్ విజయం

జింక్ గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో సైమండ్స్ బ్లూస్‌పై కవలియర్స్ సిసి విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో శ్రీకాకుళం 34 పరుగుల తేడాతో ఎలమంచిలి సిసిపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 192 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో ఎలమంచిలి సిసి నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 158 పరుగులు చేసి ఓడింది.

మందుబాబులకు అడ్డాగా మహిళా కళాశాల దారి



ప్రభుత్వ మహిళా కళాశాలకు వెళ్లే మార్గంలో మద్యం సీసాలు

డాబాగార్డెన్స్ ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 31వ వార్డు పరిధి పాతజైల్‌రోడ్డులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు వెళ్లే మార్గం మందుబాబులకు అడ్డాగా మారుతోంది. కళాశాల ద్వారం వద్దకు వచ్చేసరికి తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో ఫుట్‌పాత్‌పై నడిచి వెళ్లేందుకు అసౌకర్యంగా ఉంటోందని పలువురు వాపోతున్నారు. విద్యార్థినులు ఇబ్బందులు పడుతూనే కళాశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో మద్యం తాగి అక్కడే సీసాలు పారవేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఫుట్‌పాత్‌పై సైతం పదుల సంఖ్యలో పలకలు లేకపోవడంతో రాత్రి వేళల్లో అటుగా నడిచే పాదచారులు, ఏమరపాటులో విద్యార్థినులు పడిపోతున్న సంఘటనలు ఉన్నాయని వాపోతున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడమే దీనికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకుంటే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్డీఓ అక్రమ వారెంట్‌ను రద్దు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో జర్నలిస్టు సంఘాల నేతల డిమాండ్



ఆర్డీవో తీరుకు నిరసనగా వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో నినదిస్తున్న జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): లీడర్ దినపత్రికకు విశాఖ ఆర్‌డీఓ శ్రీలేఖ జారీ చేసిన వారెంట్‌ను తక్షణమే రద్దు చేయాలని జర్నలిస్టు సంఘాల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టుల సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి అక్రమ వారెంట్‌ను రద్దు చేసి, ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని అధికారాన్ని మీడియాపై చలాయిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని మండిపడ్డారు. పత్రిక రిజిస్ట్రేషన్, వాటిపై చర్యలు తీసుకునే అధికారం ప్రెస్ రిజిస్ట్రార్ ఆఫ్ ఇండియాకు మాత్రమే ఉందని, అక్రిడేషన్లు నిలిపేసే అధికారం కూడా మీడియా కమిటీలకు తప్ప ఎవరికీ లేదని స్పష్టం చేశారు. మీడియాపై ఈ రకమైన జులుం ప్రదర్శించడం పూర్తిగా పత్రికా స్వేచ్ఛపై దాడిగా భావిస్తున్నామన్నారు. లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ.సత్యనారాయణ, జాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.యుగంధర్‌రెడ్డి, ఐడీజెం రాష్ట్ర అధ్యక్షుడు టి.నానాజీ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కె.రాము, ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భీతిగొలుపుతున్న సత్యానగర్ మలుపు

మురళీనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఊర్వశిజంక్షన్ హైవే రోడ్డు పాలిటెక్నిక్ కాలేజీ వెనుక నివాసిత ప్రాంతాలకు చేరే దారుల్లో నివాసితులు రోడ్డు మలుపుల్లో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. సత్యానగర్ రోడ్డు నుంచి ఎగువ ఎన్‌జీజీఓస్ కాలనీ, మురళీనగర్ సెక్టార్లకు చేరే స్థానికులు వాహన ప్రయాణాల్లో మలుపులు తిరిగి ఉన్న రోడ్డు మార్గం వద్ద వాహనాలు అతిసమీపానికి వచ్చే వరకు గుర్తించడం కష్టంగా మారుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగించే వారికి ప్రయాణం ఓ గండంలా మారుతోంది. నేరుగా మురళీనగర్ మసీదు రోడ్డు నుంచి దిగువగా సత్యానగర్ ప్రాంతాల్ని దాటి కంచరపాలెం పోలీసు స్టేషన్ చేరే ఈ దారి స్థానికులకు దగ్గరగా ఉంది. మురళీనగర్, కైలాసపురం బస్ రూట్‌లో ఉండే ఒక్కగానొక్క 48ఎ బస్‌తో గమ్యస్థానాల్ని చేర లేక, దిగువ హైవే రోడ్డుకి సత్యానగర్ దారి నుంచి పాలిటెక్నిక్ కాలేజీ మార్గంలో చేరుతారు. రాత్రయితే వాహనాల వేగాన్ని ఈ మలుపు దారుల్లో గుర్తించడం కష్టంగా ఉంటోంది. ఇక్కడ విద్యుత్ దీపాలు వేసి, వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు వేయడం ద్వారా మలుపు రోడ్డులో ప్రమాదాల్ని నియంత్రించాలని, అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లుగా వర్క్ ఇన్‌స్పెక్టర్లు!

... 5వ పేజీ తరువాయి

పూర్తి సమాచారం ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకుండా వారిని ప్రోత్సహిస్తున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు కాంట్రాక్టర్లుగా మారిన వార్డుల్లో ఎవరైనా లెస్‌కు టెండర్ వేసి పనులు దక్కించుకున్నాసరే వారిని సవాలక్ష అభ్యంతరాలతో ఇబ్బందిపెట్టి మరోసారి పోటీగా టెండరు వేయకుండా చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటే కొత్తగా ఇంకెవరూ బినామీ పేర్లతో కాంట్రాక్టర్ల అవతారం ఎత్తరని పేర్కొంటున్నారు.

పెందుర్తి భూములపై పెద్దల ఆరా

... 5వ పేజీ తరువాయి

అందుబాటులో లేకపోవడంతో స్థానిక సిబ్బంది నాటి తహశీల్దార్ ఆధార్ నంబర్‌కు లింక్ చేసి ఉంటారని వివరించారు. 9102 నంబరుతో ఉన్నవన్నీ వ్యవసాయ భూములేనని, అవి సుధాకర్ నాయుడి పేరుతో లేవని, కాకపోతే ఆయన ఆధార్‌తో లింక్ అయి ఉన్నాయన్నారు.

తప్పు జరిగిందని తెలిసినా సరిదిద్దని వైనం

రికార్డుల్లో తప్పులు ఉన్నాయని, చనిపోయిన తహశీల్దార్ ఖాతా నంబర్‌పై ఒక్క పెందుర్తి మండలంలోనే 600 ఎకరాలు ఉన్నాయంటూ రమేశ్ అనే యువకుడు తహశీల్దార్‌కు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గతంలోనే ఫిర్యాదు చేశారు. ఆ భూముల విలువ రూ.2 వేల కోట్లు అంటూ పేర్కొన్నారు. వాటిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. తప్పులు సరిదిద్దే ప్రయత్నం చేయలేదు. ఇప్పుడు ఆ భూములకు మ్యుటేషన్లు కూడా చేస్తున్నారు. అవి ఎవరి పేర్ల మీదకు వెళుతున్నాయో వెల్లడించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మకు టీడీపీ, జనసేన మద్దతు

... 5వ పేజీ తరువాయి

వేయవద్దన్నారు. తన బదులు రఘువర్మకు ఓటు వేయాలని కోరారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ ఒక పర్యాయం శాసన మండలి సభ్యునిగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషిచేశానని, మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తనకు తెలుగుదేశం, జనసేన మద్దతు ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ, పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంజాయి రవాణాదారులపై షీట్లు

... 5వ పేజీ తరువాయి

బాధితులకు పరిహారం అందేలా చూడాలన్నారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోక్సో, మహిళలపై దాడుల కేసులను త్వరగా విచారణకు తీసుకువెళ్లాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఇంకా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారం, సైబర్ నేరాలు, నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు, ఇతర కేసులపై డీఐజీ సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీలు తుహిన్ సిన్హా, జిందాల్, అమిత్ బర్దార్, కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



డొంకాడలో పూజలందుకున్న దుర్గాలమ్మ

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కాలనీ డొంకాడ గ్రామస్థుల ఆరాధ్య దైవం దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. ఉదయం మహిళా భక్తులు సారెను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. సాయంత్రం పరసలో మహిళల కోలాటాలు, చెక్కభజనలు, సాముగారిడీలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథరావు, బొబ్బరి అప్పారావు, కరణం శ్రీను, అట్టా అప్పారావు, కె.పెంటారావు, సత్తిబాబు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో రావాలమ్మ పండగ

కూర్మన్నపాలెం: గ్రేటర్ 87వ వార్డు పరిధి పాతవడ్లపూడిలో రావాలమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఆలయంతో పాటు అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేయగా అధిక సంఖ్యలో భక్తులు దర్శిం చుకుని మొక్కులు చెల్లించారు. అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. పూజల్లో కార్పొరేటర్ బొండా జగన్, ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీరాములు, రాము, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ పరిధిలోని అన్ని టిడ్కో గృహ సముదాయాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులతో పాటు సీపీఐ 'గాజువాక' కార్యదర్శి కె.సత్యనారాయణ బుధవారం టిడ్కో ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవాణికి వినతిపత్రాన్ని అందజేశారు. టిడ్కో గృహ సముదాయాలకు తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు వంటి సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన సత్యవాణి మాట్లాడుతూ గృహలబ్ధిదారులందరూ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. టిడ్కో గృహ సముదాయాలకు మౌలిక వసతుల కల్పన నిమిత్తం జీవీఎంసీ అధికారులతో మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో టిడ్కో గృహ యజమానుల సంఘం ప్రతినిధులు అప్పలరాజు, సత్యనారాయణ, భాస్కరరావు, రమణి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),

● **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **మదగజరాజ:** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం),

● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 37, టమాటా 11, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 42, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 38, బీరకాయలు 56, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 12, క్యారెట్ 32 దొండకాయలు 30, బంగాళదుంపలు 14, అరటికాయ (పె)6, అల్లం (పాతది) 52, మునక్కాడలు (కిలో) 74, బరబాటి 28, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 30, క్యాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడ దుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 30, గోరుచిక్కుడు 30, కూరపెండలం 26, బ్రకోలీ 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	437
విజయనగరం	441
శ్రీకాకుళం	441

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170



పోర్టు వై-జంక్షన్ మార్గంలో నిలిపివేసిన వాహనాలు



ప్రధాన రహదారి పక్కన పార్కింగ్ చేసిన భారీ వాహనం

రహదారులపై భారీ వాహనాల పార్కింగ్

- ట్రక్ టెర్మినల్ లేకపోవడమే కారణం
- పదేళ్ల కిందట లంకెలపాలెంలో ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు
- ఆ తరువాత పట్టించుకోకపోవడంతో మరుగున పడిన వైనం

గాజువాక, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక పట్టణంగా పేరొందిన గాజువాకలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాహనాలకు ట్రక్ టెర్మినల్ లేకపోవడంతో ప్రధాన రహదారుల్లో ఎక్కడ పడితే అక్కడ భారీ వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడమే కాకుండా ట్రాఫిక్ పరమైన ఇబ్బందులు అధికమవుతున్నాయి. గాజువాక పరిసర ప్రాంతాల్లో భారీ, మధ్య, చిన్నతరహా పరిశ్రమలు అధిక సంఖ్యలో ఉండడంతో వివిధ రాష్ట్రాల నుంచి పలు రకాల సామగ్రి ఎగుమతి, దిగుమతి నిమిత్తం నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆయా వాహనాల్లో సామగ్రి అన్‌లోడ్ అయ్యేంతవరకు అందుకు సంబంధించిన కర్మాగారాల బయటే భారీ వాహనాలను పార్కింగ్ చేయల్సి వస్తుంది. అయితే కర్మాగారాల సమీపంలో కూడా ట్రక్ టెర్మినల్స్ లేకపోవడంతో ఖాళీగా కనిపించే ప్రతి రోడ్డులో భారీగా వాహనాలను నిలిపివేస్తున్నారు. ప్రధానంగా స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, ఫార్మాసిటీ, వీఈపీజడ్, బీహెచ్‌పీవీ, డాక్‌యార్డు, తదితర కర్మాగారాలకు భారీ వాహనాలు ప్రతిరోజు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. పదేళ్ల క్రితం లంకెలపాలెం సమీపంలోని సబ్బవరం రోడ్డులో సుమారు పది ఎకరాల స్థలంలో ట్రక్ టెర్మినల్‌ను నిర్మించాలని భావించారు. ఇందుకు సంబంధించి ఉన్నత స్థాయి అధికారులు కూడా స్థల పరిశీలన చేశారు. కానీ ఆ తరువాత ట్రక్ టెర్మినల్ ఏర్పాటుపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరలేదు. దీంతో ఈ ప్రాజెక్టు మరుగున పడిపోయింది. భారీ వాహనాలను పార్కింగ్ చేసేందుకు ట్రక్ టెర్మినల్ ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉక్కు యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలను విడనాడాలి

ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు 'నీరుకొండ'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగార యాజమాన్యం ఏకపక్ష, అనాలోచిత నిర్ణయాలను విడనాడాలని ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంటులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తేవాల్సిన గుర్తింపు యూనియన్ తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుందని ఆరోపించారు. వేతన సవరణ విషయంలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్లాంటులో పూర్తి స్థాయిలో ఉత్పత్తి తీసేందుకు కూడా యాజమాన్యం తగిన వనరులను సమకూర్చడం లేదన్నారు. సమావేశంలో నాయకులు కారు రమణ, బీఎస్ రాజు, ప్రభాకరరెడ్డి, ప్రసాద్, నాయుడు, కె.అవతారం, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలతో ప్లాంటును కాపాడుకుంటాం

స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు ఎలాంటి పోరాటాలకైనా తాము సిద్ధమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు అన్నారు. సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. ఉక్కు కర్మాగారం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు నమ్మి సింహాద్రి, అప్పారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆటోనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చినగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల 21వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు, ఏడీఈ ఎ.పార్థసారథి, ఏఈ రామకృష్ణలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా శ్రీనివాసనగర్, శ్రామికనగర్, ఎర్రగెడ్డ కాలనీ, దత్తసాయినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే 86 వార్డు పరిధి కేబీఆర్ 11కేవీ ఫీడర్‌లో నిర్వహణ పన్నులు చేపడుతున్నందున 21వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ నాయుడు తెలిపారు. అందువల్ల శాతవాహన నగర్, ముస్తఫా జంక్షన్, భరత్‌నగర్, కూర్మన్నపాలెం, ఐటీ రోడ్డు, గౌరీనగర్, యాతపాలెం, అశోక్ నగర్, శివాజీనగర్, శివసాయినగర్, ఆలిండియా స్టేషన్ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి తమకు సహకరించాలని కోరారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ సబ్ స్టేషన్ పరిధిలోని హరిజన జగ్గయ్యపాలెం, పోర్టు రోడ్డు 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. అందువల్ల హరిజన జగ్గయ్యపాలెం, అయ్యప్పస్వామి టెంపుల్ ఏరియా, ఎస్టీబీఎల్, పోర్టు రోడ్డు, టోల్ గేటు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

భెల్ కార్మికులకు బహుమతులు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ కార్మికులకు ఏటా మాదిరిగానే యాజమాన్యం వార్షిక బహుమతులను బుధవారం అందజేశారు. కర్మాగారంలో జరిగిన కార్యక్రమంలో ప్రెస్టేజ్ కుక్కర్‌లను కార్మికులకు ఏజీఎం ఎస్ లీల, సీనియర్ మేనేజర్ జి.చంద్రశేఖర్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ నాయకులు ఎస్.సాహూ, వీఎన్ రాజు, కొల్లి దేముడు, పి.భాస్కరరావు, కంచిపాటి ప్రకాశ్, బి.రవీంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డులో గత నెలలో ప్రారంభించిన పలు అభివృద్ధి పనులను బుధవారం కార్పొరేటర్ బొండా జగన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. తమ ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలు కూడా గమనిస్తూ సంబంధిత కాంట్రాక్టర్లతో చక్కగా పనులు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్ఎస్ విజయ రామరాజు, మాటూరి రాము, ప్రగడ దానయ్య, వర్రె రాంబాబు, డీవీ అప్పారావు, రాజన్‌రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాతలతో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా, గణబాబు, తదితరులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ పార్లమెంట్ సభ్యుడు పెతకంశెట్టి అప్పలనరసింహం జయంతి సందర్భంగా బుధవారం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు నివాసంలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని ఎంపీ ఎం.శ్రీభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పల నరసింహం పేరిట సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఎమ్మెల్యే గణబాబుకు అభినందనలు తెలిపారు. గణబాబు మాట్లాడుతూ తన తండ్రి పేరిట ఏటా నిర్వహించే శిబిరంలో పెద్దసంఖ్యలో అభిమానులు, టీడీపీ కార్యకర్తలు రక్తదానం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సుమారు 1,200 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అంతకుముందు నేతలు అప్పలనరసింహం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్సీ వి.చిరంజీవిరావు, టీడీపీ, జనసేన నేతలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ జయంతి

ఆర్పీపేట (కంచరపాలెం): పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తండ్రి, మాజీ ఎంపీ పెతకం శెట్టి అప్పలనరసింహం 89వ జయంతి సందర్భంగా జీవిఎంసీ 54,57వార్డుల్లో టీడీపీ నాయకులు, అభిమానులు వేడుకలు నిర్వహించారు. 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కుట్టా కార్తీక్ ఆధ్వర్యంలో ఐటీఐ జంక్షన్ వద్ద కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం అప్పల నరసింహం సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గణబాబు నివాసంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాజు, సుధ, ఉమ, పరశురాం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారులో విజిలెన్స్ అధికారుల తనిఖీ



కూరగాయల విక్రయాలపై ఆరాతీస్తున్న మార్కెటింగ్ శాఖ కార్యదర్శి పాపారావు

గోపాలపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుబజారులో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ బృందం గురువారం తనిఖీలు నిర్వహించింది. రైతులు, వర్తకుల వివరాలను మార్కెటింగ్ శాఖ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి పి.పాపారావు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులుఏయే పంటలు సాగు చేస్తున్నారో అడిగారు. కూరగాయలు విక్రయించే వారంతా తప్పనిసరిగా తాము పండించిన పంటలనే విక్రయించాలని, హోల్‌సేల్ మార్కెట్ నుంచి తెచ్చి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుబజారులో వసతులు, సమస్యలపై ఆరాతీశారు. మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్, డీఏఈఎంవో యాసీన్, పెందుర్తి, బీమిలి మార్కెటింగ్ కమిటీ కార్యదర్శులు అరుణ, లక్ష్మీచైతన్య పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, నిర్వహణలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామని జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తపాలెం, నాగేంద్రకాలనీ, డీఏఆర్ నగర్, సంతోష్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, ఎల్లపువానిపాలెం, పాతగోపాలపట్నం, నేతాజీ వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తామన్నారు.

వాంబే కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్



వాంబే కాలనీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

వేపగుంట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం సమీప జేఎన్ఆర్ఎంఎంకాలనీలో బుధవారం పెందుర్తి పోలీసులు విస్తృత తనిఖీలు (కార్డన్ సెర్చ్) నిర్వహించారు. ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. ఇళ్ల ముందు వాహనాలను పరిశీలించి, పత్రాలను పోల్చి చూశారు. పత్రాలు లేని ఐదు వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో సీఐలు సతీష్‌కుమార్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ గౌరవ్ ట్రైన్‌లో చార్‌ధామ్ యాత్ర

- మే 8 నుంచి ప్రారంభం

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చార్‌ధామ్ యాత్రకు వెళ్లాలనుకునే వారి కోసం మొదటి 'భారత్ గౌరవ్ ట్రైన్' అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వ యూనిట్ గఢ్వాల్ మండల్ వికాస్ నిగమ్ ప్రజా సంబంధాల అధికారి వీరేందర్‌సింగ్ రాణా తెలిపారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక పర్యాటక రైలు హరిద్వార్, యమునోత్రి, గంగోత్రి, కేదారనాథ్, బద్రీనాథ్ ప్రాంతాలను కవర్ చేస్తుందన్నారు. 16 రోజుల పూర్తిస్థాయి ప్యాకేజీ టూర్ 2025, మే 8న ప్రారంభం కానుందన్నారు. ప్రస్తుతం బుకింగ్‌లు తెరచుకున్నాయన్నారు. 1 ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ కోచ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. గమ్యస్థానాలు, మార్గాల గురించి సమాచారం ఉంటుందన్నారు. ఎంటర్‌టైన్‌మెంట్ సిస్టమ్, సీసీటీవీ కెమెరాలు, టూర్ మేనేజర్, హౌస్ కీపింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది ప్రతి కోచ్‌లో ఉంటారన్నారు. రైలు సేవా సంస్థ రీజనల్ మేనేజర్ రమేశ్ అయ్యంగార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎల్టీసీ, ఎల్ఎఫ్సీ సౌకర్యం ఉపయోగించుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు ఫోన్: 9160021414 లేదా www.tourtimes.inను సంప్రదించాలని కోరారు.

'కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్'



సదస్సులో మాట్లాడుతున్న ఆర్థికవేత్త పద్మ

మల్కాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు మాత్రమే అనుకూలంగా ఉందని, సామాన్య ప్రజలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆర్థికవేత్త ఆచార్య కె.పద్మ అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం కేంద్రబడ్జెట్‌పై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగం, తక్కువ వేతనాలు, ఆర్థిక సంక్షోభం వంటి సమస్యలకు బడ్జెట్ పరిష్కారాన్ని సూచించలేదన్నారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి వంటి ముఖ్యమైన రంగాలకు తగిన నిధులు కేటాయించలేదన్నారు. బడ్జెట్ అసమానతలను పెంచేదిగా ఉందని ఆరోపించారు. ధనవంతులకు సంపద పన్ను విధించాలని డిమాండ్ చేశారు. బొట్ట నరసింగరావు ఫౌండేషన్ సభ్యురాలు ఎం.సుజాత మాట్లాడుతూ బడ్జెట్‌తో ప్రజల జీవితానికి సంబంధం ఉందని, కానీ కేంద్రం జనాన్ని పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు బుజ్జి, అర్థశాస్త్ర అధ్యాపకుడు బీపీ రాజు, తదితరులు పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు సమస్యలను వివరిస్తున్న ఉపాధ్యాయులు


వీవీవీ స్కూల్ సమస్యలను పరిష్కరించరూ..

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'కు ఉపాధ్యాయుల విజ్ఞప్తి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ విశాఖ విమల విద్యాలయంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టవలసిందిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ప్లాంట్, బీసీ రోడ్డు వీవీవీ స్కూల్ ఉపాధ్యాయులు కోరారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పలువురు ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయుల జీతభత్యాల విషయంలో న్యాయం చేయాలని కోరారు. పాఠశాలలోని సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తానని పల్లా హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, అప్పారావు, సూర్యప్రతాప్, అనిత, రవి, పూర్వ విద్యార్థి మొల్లి పెంటిరాజు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లి



ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు పెట్టిన సిబ్బంది

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లి హెచ్చరించారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వే నంబర్-129లో వెయ్యి గజాల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను ఎటువంటి అనుమతులు లేకుండా టి.విజయకుమార్ అనే వ్యక్తి తొలగించినట్టు ఆమె గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను ఉల్లంఘించి ఆయన బోర్డులను తొలగించారన్నారు. ఆ స్థలంలోని ఆక్రమణలను బుధవారం తొలగించి మళ్లీ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. విజయ కుమార్‌పై హైకోర్టులో కంటెంప్ట్ పిటిషన్ దాఖలు చేసినట్టు తహసీల్దార్ పేర్కొన్నారు.

నేడు స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగుల ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పదవీ విరమణ ఉద్యోగులకు గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్‌ను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్లాంట్ పరిపాలనా భవనం ముందు ధర్నా చేయనున్నట్టు పదవీ విరమణ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు తెలిపారు. రిటైర్ అయిన ఉద్యోగుల మెడికల్ ప్రీమియం పెంచడం, రీయింబర్స్‌మెంట్ తగ్గించడం భావ్యం కాదన్నారు. ధర్నాలో పెద్దసంఖ్యలో ఉద్యోగులు పాల్గొనవలసిందిగా కోరారు.

రజక సంఘం ఆధ్వర్యంలో బల్లల పండగ

పెదగంట్యాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపంలోని గొడ్డువానిపాలెంలో బుధవారం బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. కుంచుమాంబ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన పండగలో భాగంగా కోలాటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు దల్లి గోవిందరెడ్డి, బొండా జగన్నాథం, సంఘం గౌరవాధ్యక్షుడు ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పులగాలిపాలెం వేణుగోపాలస్వామి ఆలయ మూడో వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మూలవిరాట్టుకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా కార్యదర్శి అయితి సింహాచలం అన్నసమారాధన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన రూ.లక్ష విరాళంగా అందించారు. అంతకు ముందు ఆయన స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ సభ్యులు కాగిత రమణ, కన్నారావు, గొంప రాజు, కాగిత అప్పలరాజు, సబ్బవరపు రామునాయుడు, ఆర్ఎస్ నాయుడు, భత్తిమాలచ గౌరీ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు స్థలం పరిరక్షణకు అధికారుల చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెందుర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చినముషిడివాడ ఎఫ్‌సీఐ గొడౌన్స్ ప్రహరీ వెనుకన గల సర్వే నంబరు 44లో 1.4 ఎకరా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు జరుగుతున్న యత్నాలను అడ్డుకునేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. దీనిపై 'సర్కారు స్థలానికి ఎసరు?' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో తహసీల్దార్ ఆనంద్‌కు మార్ సర్వే చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థలానికి సర్వే చేసి, హద్దులు ఏర్పాటుచేయాలని టౌన్ ప్లానింగ్ సర్వేయర్‌ను జెడ్సీ హేమవతి ఆదేశించారు.

చురుగ్గా కల్వర్టు నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న కల్వర్టు

ఎన్ఏడీ జంక్షన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి సుసర్లకాలనీ మార్గంలో కల్వర్టు నిర్మాణ పనులు చేపడుతున్నారు. వర్షం పడితే బీఆర్‌టీఎస్ రోడ్డుపై నీరు నిలిచిపోతుండడంతో ఈ చర్యలు చేపడుతున్నారు. ఈ మార్గంలో పాఠశాలలు, గ్యాస్ గోదాం, కాలనీ ఉన్నాయి. ఉదయం సాయంత్రం రద్దీగా ఉంటుంది. కల్వర్టుకు చంద్రమౌళీశ్వరాలయం నుంచి వచ్చే డ్రైన్ కలుపుతారు. కాగా పనుల నేపథ్యంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

మల్కాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 59వ వార్డు ములగాడలో బుధవారం బీజేపీ నాయకులు ఛత్రపతి శివాజీ 389వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు లక్కరాజు రామకృష్ణ, కొక్కిలిగడ్డ విజయ్‌బాబు, పోలిమేర శ్రీనివాసరావు శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కె.గురుమూర్తి, కె.సత్యనారాయణ, మళ్ల రవి తదితరులు పాల్గొన్నారు. త్రినాథపురంలో కార్మిక శక్తి లేబర్ యూనియన్ అధ్యక్షుడు పెద్దిరెడ్ల నానాజీ ఆధ్వర్యంలో శివాజీ జయంతి జరిగింది. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రమణకుమారి శివాజీ చిత్రపటానికి పూలమాల వేశారు.

జూట్ బ్యాగ్‌ల తయారీలో మహిళలకు శిక్షణ

మల్కాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం సౌజన్యంతో ఎదురువానిపాలెంలో మహిళలకు జూట్‌బ్యాగ్‌ల తయారీలో శిక్షణ కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. సంస్థ డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. 30 మంది మహిళలకు 45 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. ఇందుకోసం సంస్థ రూ.6 లక్షలు వెచ్చిస్తోందన్నారు. శిక్షణ అనంతరం కోర్సు కు సంబంధించిన కిట్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉదయ్, శేషపు వెంకటరమణ, ధర్మాల వేణుగోపాల్ రెడ్డి, వెంకటరమణి పాల్గొన్నారు.

టూనా చేపకు భలే క్రేజ్!

- ఎగుమతి చేసేందుకు ప్రత్యేక విధానం
- అభివృద్ధి చేసిన నిఫ్ పాట్ సంస్థ
- సష్మి గ్రేడింగ్ పద్ధతిలో ప్రత్యేక ప్యాకింగ్
- త్వరలో అందుబాటులోకి వసతులు
- మత్స్యకారులకు కాసులు కురిపించనున్న చేపలు

ఇతర దేశాల్లో భారీ డిమాండ్

ఆరోగ్యానికి మంచిదనే ప్రచారం

బీచ్ రోడ్డు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

విశాఖ తీరంలో లభించే టూనా చేపలకు విదేశాల్లో భారీ డిమాండ్ ఉంది. బంగాళా ఖాతంలో అధిక సంఖ్యలో టూనా చేపలున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వేట సాగకపోవడం, చెడిపోకుండా ప్యాకింగ్ చేసి ఎగుమతి చేసే విధానం తెలియకపోవడం కారణంగా స్థానిక మార్కెట్‌లలోనే ఈ చేపలను విక్రయిస్తున్నారు. దీంతో కిలో రూ.250కి మించి లభించడం లేదు. అయితే విదేశాల్లో ఈ చేప కిలో రూ.2 వేలకు పైగా ధర పలుకుతున్న సందర్భంలో ప్రత్యేక ప్యాకింగ్ ద్వారా ఎగుమతులకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రైనింగ్ (నిఫ్ పాట్) సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. దీనవల్ల మత్స్యకారులకు అధిక ఆదాయం లభించడంతో పాటు భారీగా విదేశీ మారకద్రవ్యం వచ్చే అవకాశాలున్నాయని చెబుతున్నారు.



టూనా చేపలను ప్యాకింగ్ చేస్తున్న మత్స్యకారులు



టూనా చేపలను తూకం వేస్తున్న మత్స్యకారుడు





ఎగుమతికి సిద్ధం చేస్తున్న దృశ్యం



సష్మి విధానంలో గ్రేడింగ్ చేసిన టూనా చేపలు

విశాఖపట్నం నుంచి టూనా చేపలను నేరుగా ఎగుమతి చేసేందుకు ప్రత్యేక కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు విశాఖలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రైనింగ్ (నిఫ్ పాట్) సంస్థ సష్మి గ్రేడింగ్ విధానంలో చేపలు చెడకుండా, ఎలాంటి వ్యర్థాలు లేకుండా అత్యంత నాణ్యతగా ఎగుమతి చేసేందుకు అవసరమైన వసతులు సమకూరుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఈ విధానం పూర్తిగా అందుబాటులోకి వచ్చి, ఎగుమతులు ప్రారంభమైతే వందల కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభించే అవకాశం ఉంది.

ఆరోగ్యానికి మేలు చేసే టూనా

టూనా చేపల్లో అమినో టాఫిడ్స్, పాలీ అన్‌శాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్ తదితరాలు పుష్కలంగా లభిస్తాయి. ఫలితంగా వాటిని భుజిస్తే గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చని, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో టూనా చేపలకు ప్రపంచ మార్కెట్‌లో అనూహ్య గిరాకీ లభిస్తోంది. మన దేశంలో ఏటా రెండు లక్షల టన్నుల టూనా చేపలు లభ్యమయ్యే అవకాశం ఉండగా, కేవలం 50 వేల టన్నులను మాత్రమే పట్టుకోగలుగుతున్నారు. అందులోనూ 'సష్మి' స్థాయిలో ఎగుమతి చేసేందుకు అవసరమైన వసతులు లేకపోవడంతో స్థానికంగానే వాటని విక్రయించుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం టూనా చేపలు స్థానిక మార్కెట్‌లో కిలోకు రూ.250 మించి ధర పలకడం లేదు. 2022-23 కేవలం 20 టన్నులు, 2023-24లో 30 టన్నులు మాత్రమే సస్మి గ్రేడ్ విధానంలో ఎగుమతి చేయగలిగామని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు లక్ష్మణరావు వెల్లడించారు.

ప్రత్యేక పద్ధతిలో ఎగుమతి

విశాఖలో సష్మి గ్రేడింగ్ కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. ఈ విధానంగా టూనా చేపలను ఎగుమతి చేసేందుకు వీలుగా మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నారు. టూనా చేపలు లభించిన తరువాత వాటిని జాగ్రత్తగా తీరానికి తీసుకువచ్చే విధానాన్ని వివరిస్తున్నారు. ఆ స్థాయిలో చేపను ఒడ్డుకు తెచ్చాక -40 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద భద్రపరచి, వాటిన ముళ్లను తొలగించి, ముక్కలు చేసి ఫ్లక్ డోసు పొరల మధ్య భద్రపరచి ప్యాక్ చేస్తారు. -20 డిగ్రీల ఉష్ణోగ్రత గల శీతల కంటైనర్లలో చెన్నై లేదా కొచ్చిన్ పంపే విధంగా ఇక్కడి కేంద్రంలో సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నారు.

విదేశీ మార్కెట్‌లో గిరాకీ....

టూనా చేపలను అత్యంత జాగ్రత్తగా భద్రపరచి, ఎగుమతి చేయడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. వలలో చేపలు పడినప్పటి నుంచి విదేశీ మార్కెట్‌కు చేర్చే వరకు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ముందుగా టూనా చేపలను ముక్కలుగా కోసి, ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసేందుకు వీలుగా సిద్ధం చేస్తే దానిని సష్మి గ్రేడ్‌గా పరిగణిస్తారు. ఈ పద్ధతిలో విదేశీ మార్కెట్లకు తరలిస్తే కిలోకు రూ.2 వేల వరకు ధర లభించే అవకాశాలున్నాయి. బ్లూ ఫిన్ టూనా చేపలకు జపాన్ మార్కెట్‌లో అత్యధికంగా కిలోకు రూ.2 లక్షల ధర పలికిన సందర్భాలున్నాయని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

మత్స్యకారులకు లాభదాయకం



లక్ష్మణరావు మత్స్య శాఖ సహాయ సంచాలకులు

విదేశీ మార్కెట్‌లో టూనా చేపలకు మంచి డిమాండ్ ఉందని మత్స్యశాఖ సహాయ సంచాలకులు లక్ష్మణరావు తెలిపారు. అధికారుల సూచనల మేరకు వాటిని జాగ్రత్తగా తీరం చేర్చడం, ప్రత్యేక పద్ధతిలో ప్యాకింగ్ చేయడం, ఎగుమతికి సిద్ధం చేయడం వల్ల మత్స్యకారులు భారీగా లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా ఫిషింగ్ హార్బర్‌లో లభ్యమవుతున్న టూనా చేపల ఎగుమతి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందంటున్నారు. భవిష్యత్తులో విరివిగా టూనా చేపలను విశాఖ మార్కెట్ నుంచే తరలించే చర్యలు ప్రారంభం కానున్నాయని, దీని వల్ల ఈ శాఖకు దేశంలోనే మంచి పేరు వస్తుందని ఆయన వెల్లడించారు.

వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల అప్పగింత



యజమానికి వాహన పత్రాలు అందిస్తున్న సీపీ, పాల్గొన్న పోలీసు అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో ఏళ్లతరబడి ఉండిపోయిన వాహనాలను వాటి యజమానులను గుర్తించి అప్పగించే ప్రక్రియకు సీపీ శంఖబ్రతబాగ్చి బుధవారం శ్రీకారం చుట్టారు. తొలిదశలో 152 వాహనాలను ఏఆర్ పోలీస్ బ్యారెక్స్‌లో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నికేసుల్లో వాహనాలను సీజ్‌చేసిన తర్వాత వాటిని వివిధ కారణాలతో యజమానులు తీసుకువెళ్లడం లేదన్నారు. మరికొందరు డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడి, భారీ జరిమానా చెల్లించాలనో, జైలుశిక్ష పడుతుందనే భయంతోనో తమ వివరాలను పోలీసులకు ఇవ్వకుండా వాహనాలను వదిలి వెళ్లిపోయారన్నారు. ఆయా వాహనాలను యజమానులకు అప్పగించేందుకు వారి వివరాలు లభ్యంకాకపోవడం, న్యాయపరమైన చిక్కులతో స్టేషన్లలోనూ, యార్డుల్లోనూ ఉండిపోతున్నాయన్నారు. నగరంలో ఇలా 869 వాహనాలుండగా, వాటిలో 272 వాహన యజమానులను గుర్తించామన్నారు. 152 వాహనాలకు న్యాయపరమైన అనుమతి రావడంతో వాటిని యజమానులకు అప్పగిస్తున్నామన్నారు. మిగిలినవాహనాలను దశలవారీగా అప్పగిస్తామని, వివరాలు లభ్యంకాని వాహనాలను వేలం వేసే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వాహనాలను క్లియర్‌చేస్తే స్టేషన్ల ఆవరణతోపాటు పీఎంపాలెంలోని అబాండెడ్ వాహనాల కోసం ఏర్పాటుచేసిన యార్డు ఖాళీ అవుతుందన్నారు. నగరంలో ఎవరి వాహనమైన చోరీకి గురైనా, లేదా సీజ్‌చేసిన వాహనాన్ని పోలీసులు విడుదల చేయడంలో ఇబ్బందిపెడుతన్నా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని సీపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 అజితావేజెండ్ల, క్రైమ్ డీసీపీ లతామాధురి, ఏసీపీలు కాళిదాసు, టి.త్రినాథ్, అన్నెపు నరసింహమూర్తి, కె.లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకుని వారి నుంచి గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఎస్‌ఐ కేటీఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సిబ్బందితో బుధవారం తనిఖీ చేస్తుండగా హర్యానాకు చెందిన బబ్లు నప్రియ గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకుని ఎనిమిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. జీఆర్పీ ఎస్‌ఐ మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ జె.టి.నాయుడుల తనిఖీలో ఒడిశాకు చెందిన ధనర్జయ పంగి 12 కిలోల గంజాయితో పట్టుబడ్డాడన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

పెందుర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆరుగురికి రెండో స్పెషల్ జ్యుడీషియల్ కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. పెందుర్తి పరిధిలో మొత్తం ఆరుగురికి రూ.10 వేల చొప్పున రూ.60 వేలు జరిమానా విధించిందన్నారు.

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల టికెట్లు తనిఖీ

- రూ.46 లక్షల అపరాధ రుసుము వసూలు



టిక్కెట్లు తనిఖీ చేస్తున్న టీసీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా ప్రయాణికుల భద్రత, సురక్షిత ప్రయాణం, సదుపాయాల కల్పన వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు ఆదేశాల మేరకు వాల్తేరు డివిజన్ చేపట్టిన ప్రత్యేక టికెట్ తనిఖీ డ్రైవ్‌లను ముమ్మరం చేసినట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ప్రధాన స్టేషన్లలో రైలు ఎక్కే సమయంలో తొక్కిసలాట జరగకుండా క్యూ పద్ధతిలో కోచ్‌లోకి ప్రవేశించేలా చర్యలు తీసుకున్నామన్నారు. దివ్యాంగులు, మహిళల కోసం కేటాయించిన కోచ్‌ల్లోకి ఇతరులు ప్రవేశించకుండా ఆర్పీఎఫ్, జీఆర్పీ, కమర్షియల్ శాఖ బృందాలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాయని పేర్కొన్నారు. వారం రోజులుగా చేపట్టిన టికెట్ తనిఖీ డ్రైవ్‌లో ఇప్పటివరకు 9,300 పైగా కేసులు నమోదు చేసి జరిమానా రూపంలో రూ.46 లక్షలు వసూలు చేశామన్నారు. జరిమానాలు చెల్లించినవారిలో ఎక్కువ మంది టికెట్ లేనివారు, బుకింగ్ లేకుండా లగేజిని రవాణా చేసిన వారున్నారని తెలిపారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో విదేశీ యువతులు



సంప్రదాయ దుస్తులతో వచ్చిన విదేశీయులు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ప్రాచుర్యం విదేశాలకు పాకింది. అమ్మవారి దర్శనానికి మున్నెన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఐఏఎస్, ఐపీఎస్, న్యాయమూర్తులు, తెలుగు రాష్ట్రాల రాజకీయ నాయకులు, సినీ రంగ ప్రముఖులు తరలివస్తున్నారు. బుధవారం ఇటలీ, ఫ్రాన్స్ దేశాలకు చెందిన నలుగురు యువతులు ఆలయానికి హిందూ సంప్రదాయ పద్ధతిలో చీరలు ధరించి వచ్చారు. ఇద్దరు ఇటలీ, ఒక ఫ్రెంచ్ యువతి చీరతో, మరో యువతి హిందూ సంప్రదాయ దుస్తుల్లో వచ్చింది. అధికారులు వారికి అమ్మవారి దర్శనం చేయించి మండపంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ ఉద్యోగులు, అర్చకులు వీరితో సెల్ఫీలు దిగారు.

'ఆప్కాస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'



సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికులు

సిరిపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు చేస్తే మునిసిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఇటీవల క్యాబినెట్ సమావేశంలో ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేటు ఏజెన్సీలకు అధికారాలు అప్పగించాలన్న ప్రతిపాదనలను వెంటనే విరమించాలన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు అధికారాలు ఇస్తే కార్మికులకు కష్టాలు తప్పవన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్ ద్వారా ప్రతి నెలా ఒకటి, రెండు తేదీల్లో జీతాలు వచ్చేవని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు ఉండేవన్నారు. ఆప్కాస్‌ను రద్దుచేస్తే మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాల్సిందేనని లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు అధ్యక్షత వహించగా, ఉరుకుటి రాజు, పి.వెంకటరెడ్డి, జి.అప్పారావు, జె.నాయుడు, శీర రమణ, ప్రసాద్, ఆదినారాయణ, వెంకటరావు, రాజశేఖర్, ఈశ్వరరావు, గణేష్, రాము, రమణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట : కలెక్టర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల నాణ్యతలో రాజీపడకుండా పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సమన్వయంతో పనిచేసి పురోగతి సాధించాలని, గడువులోగా వ్యక్తిగత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన, తదితర అంశాలపై బుధవారం గృహనిర్మాణ సంస్థ, గనుల శాఖ, జీవీఎంసీ, ఇతర శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. లేఅవుట్‌ల వారీగా తీసుకుంటున్న చర్యలపై సూచనలిచ్చారు. లక్ష్యాల మేరకు స్టేజ్ కన్వర్షన్ జరగాలని, ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు సహకరించాలన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం ఇళ్ల పూర్తి చేసేలా వేగం పెంచాలని, తగిన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అనకాపల్లి జిల్లా కుంచంగి, సబ్బవరం మండలం పెదముషిడివాడలో స్థానికుల నుంచి సమస్యలు ఎదురవుతున్నాయని హౌసింగ్ అధికారులు ప్రస్తావించారు. లేఅవుట్ పరిధిలో గ్రావెల్ తవ్వకుని అక్కడ పనులకు వాడుకుంటే స్థానిక అధికారులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారని పేర్కొనడంతో కలెక్టర్ గనుల శాఖ అధికారులతో మాట్లాడారు. సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ పీడీ సత్తిబాబు, ప్రత్యేక ఉపకలెక్టర్లు శేషశైలజ, సునీత, డీసీవో ప్రవీణ, జీవీఎంసీ ఏడీసీ డీవీ రమణమూర్తి, యూసీడీ పీడీ సత్యవేణి, హౌసింగ్ అధికారులు సూర్యారావు, నారాయణప్రసాద్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈల సదస్సులో రూ.60 కోట్ల ఒప్పందాలు



అవగాహన ఒప్పందాలను చూపిస్తున్న అతిథులు

మహారాణిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫియో సహకారంతో రివర్స్ కొనుగోలు సదస్సు మంగళ, బుధవారాల్లో జరిగింది. పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజు రెండో రోజు సదస్సును ప్రారంభించారు. 18 దేశాలకు చెందిన 25 మంది కొనుగోలుదారులు, 430 మంది ఎంఎస్ఎంఈ అమ్మకందారులు పాల్గొన్నారు. వ్యవసాయ, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్, రెడీమేడ్ వస్త్రాలు, కాస్మొటిక్స్, ఫార్మా తదితర రంగాల్లో సుమారు రూ.60 కోట్ల విలువైన 79 అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. 38 మంది ఎగుమతిదారులకు మొదటిసారి అవకాశం దక్కింది. ఎంఎస్ఎంఈ సీఈవో ఎం.విశ్వ, ఎం.గోపాలకృష్ణ, ఉన్ని కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 26 నుంచి ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రతన్ టాటా స్మారక అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ ఏప్రిల్ 26 నుంచి నిర్వహిస్తామని టోర్నీ డైరెక్టర్ మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లిలో పది రోజులు జరిగే ఈ టోర్నీలో సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. విజేతలకు రూ.12 లక్షల నగదు బహుమతులు అందిస్తామన్నారు. పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు.

పలు రైళ్లకు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నిరీక్షణ జాబితా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 24న హటియా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జత చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. రౌర్కెలా-జగదల్‌పూర్ ఇంటర్ సిటీ రైలుకు ఈ నెల 23న ఒక స్లీపర్ క్లాసు కోచ్, రౌర్కెలా-గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 21 నుంచి 23 వరకు అదనంగా ఒక స్లీపర్ క్లాసు కోచ్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఆసియా గోల్ఫ్ పోటీల విజేత ఆదిత్ వీరమాచనేని



ఆదిత్‌ను సత్కరిస్తున్న సింహాద్రి టీఎంటీ ఎండీ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆసియా జూనియర్ మాస్టర్స్ గోల్ఫ్ పోటీల్లో నగరానికి (డాబాగార్డెన్స్ రంగాస్ట్రీట్) చెందిన క్రీడాకారుడు ఆదిత్ వీరమాచనేని (11) సత్తా చాటాడు. ఈ పోటీలు థాయిలాండ్‌లో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగాయి. ఆదిత్ టోర్నీలో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి విజేతగా నిలిచాడు. గతేడాది థాయ్‌లాండ్ జరిగిన టోర్నీలోనూ ప్రతిభ చూపాడు. ఇప్పటికే పలు అంతర్జాతీయ గోల్ఫ్ కోర్సులైన అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ తదితర దేశాల్లో సత్తాచాటాడు. ఆదిత్‌కు సింహాద్రి టీఎంటీ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌కుమార్ శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

అథ్లెటిక్ జ్యోతికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



తన నివాసంలో జ్యోతిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సిరిపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయంగా విశేష ప్రతిభా పాటవాలు కనబరుస్తున్న అర్జున అవార్డు గ్రహీత ఎర్రాజీ జ్యోతికి ప్రభుత్వం అండగా ఉంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. తాను గెలుచుకున్న పతకాలతో జ్యోతి ఎంవీపీ కాలనీలోని గంటా నివాసంలో బుధవారం కలిశారు. తాను పాల్గొనబోయే పోటీల వివరాలను ఆమె వివరించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ.. అనేక జాతీయ, అంతర్జాతీయ రికార్డులు నెలకొల్పిన ఆమె ప్రతిభను గుర్తించి కేంద్రం గత నెలలో అర్జున అవార్డు అందించిందన్నారు గ్రూప్ 1 ఉద్యోగం, ఇంటి స్థలం, నగదు బహుమతి దక్కేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే గంటాను జ్యోతి కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌లతో మాట్లాడతానని తెలిపారు. కార్యక్రమంలో భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, కార్పొరేటర్ పీవీ నరసింహం, టీడీపీ నాయకులు మజ్జి వెంకటరావు, నీలాపు సూర్యనారాయణ, గాడు తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు.